నవతెలంగాణ
నిజామాబాద్-కామారెడ్డి
1
గురువారం | సెప్టెంబర్ 07, 2023 | www.navatelangana.com

స్నానపు గదుల నిర్మాణానికి భూమిపూజ

నవతెలంగాణ-వర్ని(మోస్రా)



మండలంలోని చింతకుంట గ్రామంలోని సిద్దుల గుట్ట ఆలయ ప్రాంగణంలో రూ.లక్ష రూపాయలు ఎంపీపీ నిధులచే స్నానపు గదుల నిర్మాణానికి ఎంపీపీ పిట్ల ఉమా శ్రీరాములు భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. భజన మండలి సభ్యులను అభినందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఆలయ కమిటీ సభ్యుల కోరిక మేరకు ఈ నిర్మాణం పూర్తయ్యేలోపు మరో లక్ష రూపాయల నిధులతో అదనపు స్నానపు గదుల నిర్మాణానికి నిధులు మంజూరు చేయిస్తానని హామీనిచ్చారు. కార్యక్రమంలో ఎంపీడీఓ భారతి, రైతుబంధు మండల కోఆర్డినేటర్ శ్రీరాములు, అధ్యక్షులు వంగ సాయగౌడ్, పోతన్న, నాగుల స్వామి, ఎంపీటీసీ కోర్వ రవి, పార్టీ మండలాధ్యక్షులు హన్మంత్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బోధన్ కళాశాలలో ఉన్న సమస్యలను పరిష్కరించాలి

నవతెలంగాణ-బోధన్‌టౌన్



బోధన్ పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో నెలకొన్న సమస్యలను సత్వరమే పరిష్కరించాలని ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో బుధవారం బోధన్ ఆర్డీవో రాజాగౌడ్‌కు వినతిపత్రాన్ని సమర్పించారు. మధుమలంచ జూనియర్ కళాశాల భవనం శిథిలావస్థకు చేరిందని, పక్కా భవనాన్ని నిర్మించాలని డిమాండ్ చేశారు. కళాశాలలో అధ్యాపక పోస్టులను భర్తీచేసే విధంగా అధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ఓటరు నమోదుకు స్పందన

• కలెక్టర్ జితేష్ వి పాటిల్

నవతెలంగాణ-తాడ్వాయి



మాట్లాడుతున్న కలెక్టర్

ఓటరు నమోదుకు, మార్పులు చేర్పులు, సవరణలు, తొలగింపులకు సంబంధించి చేపట్టిన స్పెషల్ డ్రైవ్, స్వీప్ కార్యకలాపాలకు మంచి స్పందన లభించిందని జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్ అన్నారు. బుధవారం కలెక్టరేట్‌లోని కాన్ఫరెన్స్ హాల్‌లో వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో ఏర్పాటు చేసిన సమావేశంలో రెవిన్యూ అదనపు కలెక్టర్ చంద్ర మోహన్‌తో కలిసి మాట్లాడుతూ.. గత జులై నుంచి ఈ నెల 5 వరకు చేపట్టిన విస్తృత ప్రచార కార్యక్రమాల వల్ల ఓటరు నమోదుకు 12,366, మార్పులు, చేర్పులకు సంబంధించి 3,160 దరఖాస్తులు, తొలగింపులకు సంబంధించి 752 దరఖాస్తులు వచ్చాయని అన్నారు. వచ్చిన దరఖాస్తులను క్షేత్రస్థాయిలో పరిశీలి స్తున్నామని, ఈ నెల 19 నాటికి ఓటరు నమోదు సంబంధించి పెండింగులో ఉన్న 10,814 దరఖాస్తులతో పాటు పెండింగులో ఉన్న 3,558 ఇతర 7,8 ఫారాలను డిస్పోజ్ చేస్తామన్నారు. రాజకీయ పార్టీల ప్రతినిధులు కూడా బూత్ స్థాయిలో ఉన్న ఓటరు ముసాయిదాను జాబితాను పరిశీలించి ప్రముఖుల పేర్లు, రాజకీయ నాయకుల పేర్లు, వార్డు సభ్యులు తదితర పేర్లు జాబితాలో ఉన్నాయో లేవో పున:పరిశీలించుకుని, తొలగిపోతే ఫారం-6 ద్వారా నమోదు చేయించాలన్నారు.

రాబోయే ఎన్నికలకు అక్టోబర్ 4న ప్రకటించబోయే తుది ఓటర్ల జాబితానే ప్రామాణిక మని, ఈ నెల 19 వరకు మాత్రమే ఓటరు నమోదుకు అవకాశ మున్నందున ఓటరు నమోదుతో పాటు అభ్యంతరాలు, ఆక్షేపణలు ఉంటే తెలియపరచాలన్నారు. ఓటర్ తొలగింపు విషయంలో ఎన్నికల సంఘం నిర్దిష్టమైన ఆదేశాలున్నాయని, మరణ ధ్రువపత్రం పొంది, నోటీసు ఇచ్చిన పక్షం రోజుల తరువాతే తొలగింపు ఉంటుందని స్పష్టం చేశారు. స్వీప్ ద్వారా కళాశాల స్థాయిలో ఓటరు నమోదుకు విస్తృత అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. అక్టోబర్ 1, 2023 నాటికి 18 సంవత్సరాలు నిండే యువ ఓటర్లు, ప్రధానంగా యువ మహిళా ఓటర్ల నమోదుకు చొరవ తీసుకుంటున్నామన్నారు. తుది ఓటర్ల జాబితా ప్రకటన తరువాత పోలింగ్ బూతులపై ప్రత్యేక దృష్టిపెట్టి రాంప్, వీల్‌చైర్, మంచి నీటి సౌకర్యం, శౌచాలయాలు వంటి మౌలిక సదుపాయాల కల్పన ఏర్పాట్లు చూస్తామన్నారు. అదేవిధంగా వ్యయ నియంత్రణ, వీడియోగ్రఫీ, పోలింగ్ సిబ్బందికి శిక్షణ వంటి కార్యక్రమాలు చేపట్టనున్నామన్నారు. పోలింగ్ బూత్ స్థాయిలో ఏజెంట్‌ల నియామకానికి రాజకీయ పార్టీల ప్రతినిధులు అభ్యర్థులను నియమించుకోవలసినదిగా సూచించారు. కార్యక్రమంలో వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు అనిల్ కుమార్, బాల రాజు, ఖాసిం అలీ, మదన్‌లాల్ జాదవ్, మహమ్మద్ జఫ్ఫార్ ఖాన్, మహమ్మద్ ఫయాజ్, వెంకట్‌గౌడ్, ఎలక్షన్ సూపరింటెండెంట్ అనిల్ కుమార్, డిప్యూటీ తహసీల్దార్ ఇందిర ప్రియదర్శిని పాల్గొన్నారు.

అంకితభావంతో పనిచేస్తేనే గుర్తింపు..

నవతెలంగాణ-తాడ్వాయి

అంకితభావంతో పనిచేసిన ప్రభుత్వ ఉద్యోగులు ప్రజల మన్ననలను పొందుతారని కలెక్టర్ జితేష్ వి పాటిల్ అన్నారు. సమర్థత గల అధికారిగా పేరుతెచ్చుకొని పదోన్నతిపై హైదరాబాద్‌కు వెళ్తున్న జిల్లా సహకార అధికారిని వసంతకు బుధవారం కలెక్టరేట్‌లోని కాన్ఫరెన్స్‌హాల్‌లో ఏర్పాటు చేసిన వీడ్కోలు సమావేశంలో కలెక్టర్ మాట్లాడారు. అన్ని శాఖల ఉద్యోగులతో ఆమె సమన్వయంతో పని చేసిందని కొనియాడారు. ధాన్యం కొనుగోళ్ల సమయంలో కీలకపాత్ర పోషించారన్నారు. ఈ సందర్భంగా జిల్లాకు నూతనంగా మైనారిటీ సంక్షేమాధికారిగా విచ్చేసిన నవీన్‌ను, జిల్లా మహిళా శిశు సంక్షేమాధికారిగా వచ్చిన బావయ్యలను కామారెడ్డి జిల్లాకు సాదరంగా ఆహ్వానిస్తూ అందరం ఒక కుటుంబ సభ్యుల్లా పనిచేద్దామన్నారు. ప్రభుత్వం అమలు చేస్తున్న వివిధ సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలలో భాగస్వాములు కావాలని కోరారు. అనంతరం బదిలీపై వెళ్తున్న వసంతను, జిల్లాకు నూతనంగా వచ్చిన సంక్షేమ అధికారులను కలెక్టర్ సన్మానించారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ చంద్రమోహన్, సీపీఓ రాజారామ్, జిల్లా అధికారులు భాగ్యలక్ష్మి, సతీష్ యాదవ్, సింహరావు, అభిషేక్‌సింగ్, మల్లికార్జున్‌బాబు, రమ్య, రజిత, సాయిబాబా, వరదారెడ్డి, దయానంద్ తదితరులు పాల్గొన్నారు.



రోడ్డు ప్రమాదాల నివారణకు
పకడ్బందీ చర్యలు

• రోడ్డు భద్రతా కమిటీ సమావేశంలో కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతు

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ



మాట్లాడుతున్న కలెక్టర్

రోడ్డు ప్రమాదాలను నివారించేందుకు పకడ్బందీ చర్యలు చేపట్టాలని కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతు సంబంధిత అధికారులను ఆదేశించారు. సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలో బుధవారం కలెక్టర్ అధ్యక్షతన రోడ్డు భద్రతా జిల్లా కమిటీ సమావేశం నిర్వహించారు. పోలీస్, రవాణా, ఆర్అండ్‌బీ, పంచాయతీ రాజ్, జాతీయ రహదారుల సంస్థ, జిల్లా వైద్యారోగ్య శాఖ, ఆర్టీసీ, రెడ్‌క్రాస్ ప్రతినిధులు పాల్గొని రోడ్డు ప్రమాదాలపై చర్చించారు. జిల్లా మీదుగా రెండు ప్రధాన జాతీయ రహదారులు వెళ్తుండడం వల్ల తరుచూ ప్రమాదాలు చోటుచేసుకుంటున్నందున, వాటికి ఆస్కారం లేకుండా అవసరమైన అన్ని జాగ్రత్తలు తీసుకోవాలని కలెక్టర్ సంబంధిత అధికారులకు సూచించారు. ప్రమాదాలు ఎక్కువగా జరుగుతున్న ప్రదేశాలను బ్లాక్ స్పాట్లుగా పరిగణిస్తూ, ప్రమాదాలకు దారి తీస్తున్న కారణాలను గుర్తించాలన్నారు. పోలీస్, ఆర్అండ్‌బీ, రోడ్ ట్రాన్స్‌పోర్ట్ తదితర శాఖలు సమన్వయంతో పనిచేస్తూ జాయింట్ సర్వే నిర్వహించి సమగ్ర నివేదిక రూపొందించాలని కలెక్టర్ ఆదేశించారు. ఒక్కో ప్రాంతం వారీగా సునిశిత పరిశీలన జరపాలన్నారు. ప్రమాదాలకు మూల మలుపులు, కల్వర్టులు, ఎత్తుపల్లాలు, రోడ్డు నిర్మాణం సరిగా లేకపోవడం వంటి కారణాలను గమనిస్తే, వాటిని వెంటనే సరిచేసేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. ప్రమాదాలకు ఆస్కారం ఉన్న ప్రాంతాల్లో వాహనదారులను అప్రమత్తం చేసేలా సైన్ బోర్డులు ఏర్పాటు చేయాలని సూచించారు. ఆర్టీసీ డ్రైవర్లు సహా, ఇతర ప్రైవేట్ వాహనాల ఆపరేటర్లకు రోడ్డు భద్రతా చర్యలు విధిగా పాటించేలా నిబంధనల పట్ల స్పష్టమైన అవగాహన కల్పించేందుకు విస్తృత చర్యలు చేపట్టాలన్నారు. నిజామాబాద్ జిల్లా కేంద్రంతో పాటు ఇతర పట్టణాల్లోనూ ముఖ్య కూడళ్లు, ప్రధాన మార్గాల్లో ట్రాఫిక్ ఇబ్బందులు తలెత్తకుండా, ప్రమాదాలు జరగకుండా అవసరమైన చర్యలు చేపట్టాలని కలెక్టర్ సంబంధిత అధికారులను ఆదేశించారు. డివైడర్లు, ఐలాండ్‌ల వల్ల ఎక్కడైనా సమస్యలు ఉత్పన్నం అవుతున్నాయా అన్నది గుర్తించాలన్నారు. నగరంలో వాహనాల పార్కింగ్ కోసం అనువైన ప్రదేశాలను గుర్తించాల్సిన ఆవశ్యకత ఉందని సమావేశంలో సభ్యులు అభిప్రాయపడ్డారు. సమావేశంలో నగర పాలక సంస్థ కమిషనర్ ఎం.మకరంద్, వివిధ శాఖల అధికారులు, రెడ్‌క్రాస్ ప్రతినిధి బుస్సా ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

ప్రజలపై ఆర్థికభారం మోపుతున్న కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు

• సీపీఐ(ఎం) ఆధ్వర్యంలో నిరసన

నవతెలంగాణ-బోధన్



నిరసన వ్యక్తం చేస్తున్న నాయకులు

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజలపై ఆర్థికభారం మోపుతున్నాయని సీపీఐ(ఎం) నాయకులు అన్నారు. ప్రజావ్యతిరేక విధానాల తీరుకు బుధవారం బోధన్ మండలంలోని ఊట్‌పల్లిలో సీపీఐ(ఎం) ఆధ్వర్యంలో నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా బోధన్ ఏరియా కమిటీ కార్యదర్శి ఏశాల గంగాధర్ మాట్లాడుతూ.. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వ్యతిరేక పరిపాలన కొనసాగిస్తూ ప్రజలపై ఆర్థికభారం మోపుతున్నారని అన్నారు. నిరుపేదల పొట్టకొట్టి పెట్టుబడుదారులకు లాభాలు కలిగిస్తున్నారన్నారు. పెట్రోల్, డీజిల్, గ్యాస్, కరెంటు చార్జీలు విపరీతంగా పెంచి, నిత్యావసర వస్తువుల ధరల్ని పెంచి ప్రజలకు అందుబాటులో లేకుండా చేశారని అన్నారు. విదేశాలలోని నల్ల డబ్బులు తీసుకువచ్చి ప్రతి పేద కుటుంబానికి రూ.15లక్షలు అకౌంట్‌లో వేస్తామని, అదీ అమలు చేయలేదని అన్నారు. సంవత్సరానికి రెండు కోట్ల ఉద్యోగాలు ఇస్తామని అయిన వాటిని అమలు చేయలేదన్నారు. కుల, మతాలు ప్రాంతాల పేరు మీద రెచ్చగొడుతూ రాజకీయ పబ్బం గడుపుతూ ప్రజల్ని విచ్చినం చేసి పెట్టుబడుదారుల కొమ్ము కాస్తూ పరిపాలన కొనసాగిస్తున్నారని మండిపడ్డారు. 2024 ఎన్నికలలో కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వానికి ప్రజలు తగిన గుణపాఠం చెప్పాలని పిలుపునిచ్చారు. తెలంగాణ వస్తే సకల సమస్యలకు పరిష్కారం చూపుతామన్న కేసీఆర్ ప్రభుత్వం ఇచ్చిన హామీలు అమలు చేయడం లేదని విమర్శించారు. కార్యక్రమంలో పార్టీ సీనియర్ నాయకులు దండు సాయిలు, సుంకరి లక్ష్మీ, దండు రాణి, సావిత్రి, అనిత, సాయికుమార్, స్వరూప తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా శ్రీకృష్ణాష్టమి వేడుకలు

ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా పలు గ్రామాల్లో శ్రీకృష్ణాష్టమి వేడుకలను బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పలు పాఠశాలలతో పాటు ఇతర చోట్ల సంప్రదాయబద్ధంగా ఉట్టి కొట్టే కార్యక్రమాలు చేపట్టారు. అలాగే పలువురు చిన్నారులు కృష్ణుడు, గోపిక వేషాధారణలో అలరించారు.

- నవతెలంగాణ,
విలేకరుల బృందం





నికాల్‌పూర్‌లో కృష్ణుడి వేషాధారణలో బాలుడు.. ఎడపల్లి, జుక్కల్‌లో గోపికల వేషాధారణలో చిన్నారులు..



ఎడపల్లి మండల కేంద్రంలో..



నిజామాబాద్‌సిటీ : వినాయక్‌నగర్‌లో కృష్ణుడి వేషాధారణలో కవలలు

కష్టపడి చదివి ఉన్నత స్థానంలో స్థిరపడాలి

• జిల్లా అధికారి షేక్ సలాం

నవతెలంగాణ-రామారెడ్డి



కష్టపడి చదివి ఉన్నత స్థానాల్లో స్థిరపడి, తల్లిదండ్రులకు, ఉపాధ్యాయులకు, మంచి పేరు తేవాలని జూనియర్ కళాశాల జిల్లా అధికారి షేక్ సలాం విద్యార్థులను ఉద్దేశించి అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో స్వయం పాలన దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా షేక్ సలాం మాట్లాడుతూ.. విద్యార్థి దశ చాలా విలువైనదని, జీవితాన్ని మలుపు తింపేదే విద్యార్థి దశా అని, విద్యార్థులు లక్ష్యాన్ని పెట్టుకుని, ఆ లక్ష్యం కోసం కృషి చేసి లక్ష్యాన్ని చెల్లించాలని అన్నారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ మధు, రాజాగౌడ్, రమేష్, సిద్దయ్య, ప్రసాద్, తిరుపతి, రాజు, కృష్ణవేణి, చైతన్య, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

విద్యాహక్కు చట్టంపై అవగాహన

నవతెలంగాణ-లింగంపేట్

మండల కేంద్రంలోని వెనకబడిన తరగతుల వసతి గృహంలో బుధవారం సమాచార హక్కు చట్టంపై అవగాహన కల్పించినట్టు సహ చట్టం రాష్ట్ర డైరెక్టర్ సలీం అన్నారు. సమాచార హక్కు చట్టం పరిరక్షణ కమిటీ-2005 ఆధ్వర్యంలో వసతి గృహం వార్డెన్ రాజేశ్వర్ అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో రాష్ట్ర డైరెక్టర్ సలీం విద్యాహక్కు చట్టం, బాలకార్మికుల చట్టం, సమాచార హక్కు చట్టంపై అవగాహన కల్పించారు. విద్యా హక్కు చట్టాన్ని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలన్నారు. అదేవిధంగా మైనార్టీ జూనియర్ కళాశాల సందర్శించి విద్యకు చట్టం సమాచార హక్కు చట్టం బాల కార్మిక చట్టం గురించి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సమాచార హక్కు చట్టం తెలంగాణ రాష్ట్ర జోనల్ అధ్యక్షులు ప్రదీప్ కుమార్, రాష్ట్ర జోనల్ ప్రధాన కార్యదర్శి లేగ్గేల రాజు, జిల్లా ఉపాధ్యక్షులు అలీమ్, జిల్లా సలహాదారులు మదర్ పాషా, జిల్లా ఈసీ మెంబర్ లింగమయ్య, మండలాధ్యక్షులు ప్రభాకర్, క్రైమ్ రిపోర్టర్ రజినీకాంత్ విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

చీకటిని పారదోలి వెలుగును నింపేది ఉపాధ్యాయులే

• జడ్పీటీసీ కమిలి నర్సింలు

నవతెలంగాణ-సదాశివనగర్

చీకటిని పారదోలి వెలుగును నింపేది ఉపాధ్యాయులేనని జడ్పీటీసీ కమిలి నర్సింలు అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని రైతువేదికలో 22 మంది ఉత్తమ ఉపాధ్యాయులను సన్మానించారు. ఈ సందర్భంగా జడ్పీటీసీ కమిలి నర్సింలు మాట్లాడుతూ.. ఉపాధ్యాయులు దేశానికి దిక్సూచిలు అన్నారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులను శాలువాలు పూలదండలతో సన్మానించారు. వారికి మెమోంటోలను అందించారు. కార్యక్రమంలో ఎంపిపి గైని అనుసూయ, బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు బొలిపెల్లి మహేందర్‌రెడ్డి, ఎంఈఓ యూసఫ్, సదాశివనగర్ సర్పంచ్ బద్దం శ్రీనివాస్‌రెడ్డి, ఏలేటి భూంరెడ్డి, వి.డి.సి చైర్మన్ కుమ్మరి రాజయ్య అశోక్‌రెడ్డి, కమలాకర్‌రావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ట్రాన్స్‌ఫార్మర్ కాయిల్స్ చోరీ

నవతెలంగాణ-బోధన్

సాలూర ఎత్తిపోతల పథకం వద్ద గల ట్రాన్స్ ఫార్మర్‌ను మంగళవారం రాత్రి గుర్తుతెలియని దుండగులు ధ్వంసం చేసి వాటి కాయిల్స్‌ను ఎత్తుకెళ్లినట్లు ఎత్తిపోతల కమిటీ ప్రతినిధి సురేష్ పటేల్ తెలిపారు. లక్షల రూపాయల విలువైన ట్రాన్స్‌ఫార్మర్ చోరీకి గురికావడం వలన ఎత్తిపోతల నిర్వహణకు ఇబ్బందులు కలిగే అవకాశం ఉందని తెలిపారు. ఎత్తిపోతల పథకానికి సంబంధించి ట్రాన్స్‌ఫార్మర్ కాయిల్స్ చోరీకి గురికావడం ఇది రెండవ సారి అని తెలిపారు. ఈ చోరీ ఘటనపై బోధన్ రూరల్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు సురేష్ పటేల్ తెలిపారు.

పోలింగ్‌స్టేషన్‌ను పరిశీలించిన ఎల్లారెడ్డి ఆర్‌డీఓఎం ప్రభాకర్

నవతెలంగాణ-రామారెడ్డి

మండలంలోని ఇస్సన్నపల్లి, రామారెడ్డి గ్రామంలోని పోలింగ్‌స్టేషన్లో ఎల్లారెడ్డి ఆర్‌డీఓఎం ప్రభాకర్, స్థానిక ఎమ్మార్వో రోజాతో కలిసి బుధవారం పరిశీలించారు. స్థానిక పోలీస్‌స్టేషన్లో మౌలిక వసతుల గూర్చి అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట మండల అధికారులు శ్రీనివాస్‌రెడ్డి, కళాశాల ప్రిన్సిపాల్ మధు, ఉపాధ్యాయులు బాలరాజు తదితరులున్నారు.

ఎమ్మార్వోకు సమ్మె నోటీసు అందజేత



నవతెలంగాణ-రామారెడ్డి

మండల కేంద్రంలో బుధవారం ఎమ్మార్వో రోజాకు సీఐటీయూ నాయకులు, అంగన్వాడీ టీచర్లు సమ్మె నోటీసు అందజేశారు. ఈ సందర్భంగా అంగన్వాడీ లీడర్లు మాట్లాడుతూ.. ఈనెల 11 నుంచి అంగన్వాడీ సమస్యల పరిష్కారం కోసం నిరవధిక సమ్మెను నిర్వహించనున్నామని అన్నారు. అంగన్వాడీ టీచర్లకు 26వేల గౌరవ వేతనాన్ని అందించాలని, 60 సంవత్సరాలకు పదవి విరమణ, పదవి విరమణ సమయంలో 10 లక్షల నుంచి 50లక్షల వరకు బెనిఫిట్స్ అందించాలని డిమాండ్ చేశారు. పద్మజ, ఇందిరా, తదితరులు పాల్గొన్నారు.

మండలంలో 6.8 మిల్లీమీటర్ల వర్షపాతం

నవతెలంగాణ-రామారెడ్డి

మండలంలో నాలుగవ రోజు బుధవారం 6.8 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైనట్లు సంబంధిత అధికారులు తెలిపారు. వర్షాలతో ఆరు తడి పంటలు దెబ్బతినే ప్రమాదం ఉన్నందున, రైతులు నీరు పంటలలో ఇలా ఉండకుండా జాగ్రత్తలు తీసుకోవాలని, వ్యవసాయ అధికారి సోమారిష్ కుమార్ తెలిపారు.

విద్యార్థులు లక్ష్యంతో ముందుకెళ్లాలి

• మలావత్ పూర్ణ

నవతెలంగాణ-లింగంపేట్



పాఠశాల ఉపాధ్యాయ బృందం మాలవత్ పూర్ణిమకు పూలదండ వేసి శాలువాకప్పి ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయుల బృందం విద్యార్థులు పాల్గొన్నారు.

విద్యార్థులు లక్ష్యంతో ముందుకువెళ్లాలని ఎవరెస్ట్ శిఖరాన్ని అధిరోహించిన మాలవత్ పూర్ణ సూచించారు. బుధవారం మండల కేంద్రంలోని జ్యోతిరావుపూలే బీసీ గురుకుల పాఠశాలను ఆమె సందర్శించారు. ఈ సందర్భంగా మాలవత్ పూర్ణకు పాఠశాల సిబ్బంది, ఉపాధ్యాయ సిబ్బంది విద్యార్థులు ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా విద్యార్థులనుద్దేశించి మాట్లాడుతూ.. ప్రతి విద్యార్థి లక్ష్యాన్ని ఎంచుకొని చదివితే అనుకున్నది సాధించ వచ్చునన్నారు. పేదరికానికి చదువు అడ్డం కాదన్నారు. ప్రతి విద్యార్థి ఒక లక్ష్యం ఉండాలని గమ్యం చేరాలంటే ఎన్నో ఒడిదొడుకులు ఉంటా యని వాటన్నింటినీ అధిగమించాలని అప్పుడే అంతిమ విజయం సాధిస్తామన్నారు. ఎవరెస్టు శిఖరాన్ని అధిగమించడానికి ఎదుర్కొన్న సమస్యలను ఆమె విద్యార్థులకు వివరించారు. అంతేకాకుండా ఆమె సాధించిన విజయాలను తెలిపారు. ప్రతి విద్యార్థి పర్సనల్ డెవలప్‌మెంట్ ఖచ్చితంగా ఉండాలన్నారు. కష్టపడి చదివితే అనుకున్న విజయాన్ని సాధిస్తారని ఆమె ఆశాభావం వ్యక్తం చేశారు. అనంతరం పాఠశాల ప్రిన్సిపాల్ జ్యోతిర్మయి ఆధ్వర్యంలో

ముదిరాజ్‌లకు ప్రాధాన్యత ఇవ్వకపోతే ఏ పార్టీనైనా బహిష్కరిస్తాం

• రాష్ట్ర కార్యదర్శి అబ్రబోయిన స్వామి

నవతెలంగాణ-తాడ్వాయి



మాట్లాడుతున్న అబ్రబోయిన స్వామి

ముదిరాజ్‌లకు ప్రాధాన్యత ఇవ్వకపోతే బీఆర్ఎస్ సహా ఏ పార్టీనైన బహిష్కరిస్తామని ముదిరాజ్ మహాసభ రాష్ట్ర కార్యదర్శి అబ్రబోయిన స్వామి అన్నారు. కామారెడ్డి పట్టణంలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ముదిరాజ్‌లలో అసంతృప్తికి కారణం కేసీఆర్ మాత్రమేనన్నారు. తెలంగాణ ఉద్యమంలో మొట్ట మొదటి అమరవీరుడు పోలీస్ కిష్టయ్య ముదిరాజ్ అనే విషయాన్ని కేసీఆర్ గుర్తుంచుకోవాలన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా 65 మంది ముదిరాజ్‌లు చనిపోయారని గుర్తుచేశారు. అలాంటి తమకు ఒక్క టికెట్ కూడా ఇవ్వకపోవడాన్ని తప్పుబట్టారు. కామారెడ్డి నియోజకవర్గంలో 50 వేలు, ఎల్లారెడ్డిలో 70 వేలు, జుక్కల్, బాన్సువాడ నియోజకవర్గాల్లో 40 వేల చొప్పున ముదిరాజ్‌లు ఉన్నారని, గెలుపోటములు శాసించే స్థాయిలో ఉన్న తమను పట్టించుకోని ఏ పార్టీ అయినా తాము బహిష్కరిస్తామని పేర్కొన్నారు. ఈ నెల 8న కామారెడ్డిలో నిర్వహించే ముదిరాజ్ మేధావుల రౌండ్‌టేబుల్ సమావేశంలో భవిష్యత్ కార్యాచరణ ప్రకటిస్తామని చెప్పారు. సమావేశంలో జిల్లా లీగల్ అడ్వైజర్ సూర్యప్రసాద్, కాకర్ల శేఖర్, కిష్టయ్య, అశోక్, లింగం, దేవేందర్, ప్రభాకర్, బాల్‌రాజ్, రాజలింగం, నారాయణ, దేవరాజ్ పాల్గొన్నారు.

మత్తడి దూకుతున్న రాళ్లవాగు

నవతెలంగాణ-కమ్మర్‌పల్లి

మండలంలోని కోనాపూర్ గ్రామ శివారులో ఉన్న రాళ్ల వాగు ప్రాజెక్టు మత్తడి దూకుతూ అలుగు పారుతోంది. మూడు రోజులగా కురుస్తున్న వర్షాలకు ప్రాజెక్టు వెనుక భాగంలో ఉన్న గుట్టల ప్రాంతాల నుండి పెద్ద ఎత్తున వరద నీరు వచ్చి చేరడంతో ప్రాజెక్టు పూర్తి స్థాయిలో నిండి మత్తడి దూకుతూ కనువిందు చేస్తుంది. ప్రాజెక్టు కింద ఆయకట్టు రైతులు రెండు పంటలు సాగు చేసేందుకు వీలుండడంతో ఆనందం వ్యక్తం చేస్తున్నారు.



మత్తడిపైనుండి పారుతున్న నీరు

పశువులకు గాలికుంటు వ్యాధి నిరోధక టీకాలు

నవతెలంగాణ-మాక్లూర్

మండలంలోని మదన్ పల్లి, మదన్ పల్లి తండా గ్రామాల్లో 467 పశువులకు ఉచిత గాలికుంటు వ్యాధి నిరోధక టీకాలు వేసినట్లు పశు వైద్యులు డా. కిరణ్‌దేశ్ పాండే బుధవారం తెలిపారు. పశువుల యజమానులు తప్పకుండా తమ పశువులకు గాలికుంటు వ్యాధి నిరోధక టీకాలు వేసించాలని సూచించారు. కార్యక్రమంలో సర్పంచ్ శంకర్ గౌడ్, ఎంపిటిసి ఒడెన్న, వైద్యురాలు ఉమమ సహేర్ వాస్, పశువైద్య సిబ్బంది విఎల్‌ఓ టి. వినీత, జేవిఓ గంగజమున, విఏ పాషా, ఆఫీస్ సబార్డినేట్స్ పాల్గొన్నారు.



టీకావేస్తున్న సర్పంచ్

ఎన్నికలపై అవగాహన

నవతెలంగాణ-కమ్మర్‌పల్లి

మండలంలోని బషీరాబాద్ గ్రామపంచాయతీ కార్యాలయంలో బుధవారం ఎన్నికలపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. రెవెన్యూ ఇన్స్పెక్టర్ శరత్ కుమార్ హాజరైన ప్రజలకు ఎన్నికలపై అవగాహన కల్పించారు. 18 సంవత్సరాలున్న ప్రతి ఒక్కరూ ఓటరుగా నమోదు చేసుకోవాలన్నారు. ఓటర్ లిస్టులో తప్పులుంటే ఫారం-8 ద్వారా తప్పులను సరి చేసుకోవడానికి దరఖాస్తు చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ సక్కారం అశోక్, పంచాయతీ కార్యదర్శి శ్రీనివాస్, బిఎల్‌ఓలు సువర్ణ, ప్రణవ, శ్రీధర్, ప్రజలు పాల్గొన్నారు.

పీజీ పరీక్షల రివాల్యుయేషన్‌కు తేదీ ప్రకటన

నవతెలంగాణ-డిచ్‌పల్లి

తెలంగాణ యూనివర్సిటీ పరిధిలోని పీజీ పరీక్షల రివాల్యుయేషన్ షెడ్యూల్ ను తెలంగాణ యూనివర్సిటీ పరీక్షల నియంత్రణ అధికారిని ప్రొఫెసర్ డాక్టర్ ఎం అరుణ బుధవారం విడుదల చేశారు.

ఆగస్టు 2023 లో విడుదల చేసిన పీజీ. 01వ,03వ,05వ మరియు.06వ సెమిస్టర్ రెగ్యులర్ పరీక్షల ఫలితాల రివాల్యుయేస్ చేయించుకో వచ్చునని వెల్లడించారు. ఎం. ఏ(అప్లైడ్ ఎకనామిక్స్) ఐదు సంవత్సరాల కోర్స్ సెమిస్టర్,01వ. 03వ. 05వ మరియు,06వ సెమిస్టర్ కు సంబంధించిన విద్యార్థులు, ఐఎంబీఏ ఐదు సంవత్సరాలు కోర్సులో 01వ.03వ.05వ మరియు,06వ సెమిస్టర్ విద్యార్థులు, ఎంఎస్సీ(ఫార్మసూటికల్,కెమిస్ట్రీ) ఐదు సంవత్సరాల కోర్స్ 01వ.03వ. మరియు 5వ సెమిస్టర్ పూర్తి చేసిన విద్యార్థులు, ఎల్.ఎల్.బి 01వ.03వ. మరియు 5వ సెమిస్టర్ విద్యార్థులు,బి ఎల్ ఐ ఎస్ సి (లైబ్రరీ సైన్స్)మొదటి సెమిస్టర్ విద్యార్థులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని తెలిపారు. ఒక్క పేపర్ రీవాల్యుయేషన్ కొరకు 500 రూపాయలు చెల్లించాల్సి ఉంటుందని, రీవాల్యుయేషన్ ఫామ్ కు 25/ రూపాయిలు చెల్లించాలని సూచించారు. విద్యార్థులు పూర్తి వివరాలకు కళాశాల ప్రిన్సిపల్ ను సంప్రదించగలరు.Registrar, Examination Account (A/C. No. 31079102875)SBI Telangana uniyersity Branch రివాల్యుయేషన్ ఫీజు ని చెల్లించాలని కోరారు. రివాల్యుయేషన్ కొరకుఅప్లికేషన్ చివరి తేదీ ఈనెల 12 వరకు ఉంటుందని తెలిపారు. తమ మార్కుల జాబితాను జతపరచి తేదీ 13-09 వరకు యూనివర్సిటీ పరీక్షల విభాగం ప్రత్యేక కౌంటర్లో అందజేయలన్నారు. పూర్తి వివరాల కోసం http://www.telanganauniversity.in.ac మా వెబ్సైట్లో పొందుపరచడం జరిగిందని తెలంగాణ యూనివర్సిటీ పరీక్షల నియంత్రణ అధికారిని ప్రొఫెసర్ డాక్టర్ అరుణ గారు తెలిపారు.

చిరుధాన్యాల విశిష్టతపై అవగాహన



చిరుధాన్యాలపై అవగాహన అవగాహన కల్పిస్తున్న సూపర్‌వైజర్

నవతెలంగాణ-ఆర్మూర్

మండలంలోని పిప్రీ గ్రామ అంగన్వాడికేంద్రంతో బుధవారం పోషకాహార వారోత్సవాల కార్యక్రమాలు ఘనంగా నిర్వహించారు. గర్భిణులకు, బాలింతలకు, తల్లులకు ఆకుకూరల, చిరుధాన్యాల విశిష్టతను అంగన్వాడి సూపర్వైజర్ వెంకట రమణమ్మ తెలిపారు. ఈ సందర్భంగా వెల్ బేబీ షో కార్యక్రమం సైతం నిర్వహించారు. కార్యక్రమంలో అంగన్వాడి టీచర్లు రాణి, శ్యామల, కవిత, గంగుబాయి తదితరులు పాల్గొన్నారు.

వైద్యులు మధుశేఖర్‌ను సన్మానించిన నవనాథపురం ప్రెస్‌క్లబ్

నవతెలంగాణ-ఆర్మూర్

పట్టణానికి చెందిన ఎం.జి ఆసుపత్రి అధినేత, ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ హెల్త్, ఫ్యామిలీ వెల్ఫేర్ రాష్ట్ర చైర్మన్‌గా బాధ్యతలు స్వీకరించిన డాక్టర్ మధుశేఖర్‌ను నవనాథపురం ప్రెస్ క్లబ్ ఆధ్వర్యంలో బుధవారం పూలమాలలు, శాలువాతో ఘనంగా సన్మానం చేశారు. నవనాథపురం ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు సాత్ పుతే శ్రీనివాస్, అధ్యక్షుడు సుంకర్ గంగా మోహన్, ప్రధాన కార్యదర్శి చరణ్ గౌడ్ , కోశాధికారి లిక్కి శ్రావణ్, సలహాదారుడు గణేష్ గౌడ్ సన్మానం చేశారు. రాబోయే రోజుల్లో మరిన్ని ఉన్నతమైన పదవులు పొందాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో క్లబ్ సభ్యులు వెంకటేష్ గుప్తా, సామ సురేష్, వినోద్, సూరిబాబు, ముఖేష్, షికారి శ్రీనివాస్ దినేష్, గటడి అరుణ్, మహేష్, రాజేందర్ తదితరులు పాల్గొన్నారు.

పీజీ బ్యాక్‌లాగ్ పరీక్షల షెడ్యూల్ విడుదల

నవతెలంగాణ-డిచ్‌పల్లి

తెలంగాణ యూనివర్సిటీ పరిధిలోని పీజీ బ్యాక్లాగ్ పరీక్షల తేదీలను ఖరారు చేశారు.కోర్సుల వారిగా ఫీజుల వివరాలు వెల్లడించారు. పీజీ ఒకటవ మూడవ, ఐదవ సెమిస్టర్ (థియరీ మరియు ప్రాక్టికల్) బ్యాక్ లాగ్ ఎగ్జామ్స్లలి ఎమ్ఏఎంఎస్సి, ఎమ్మెస్ డబ్ల్యూ, ఎంకామ్, ఎంబీఏ, ఎంసీఏ, ఎల్ఎల్‌బి, ఏపీఈ, ఐఎంబిఏ, ఐపిసిహెచ్, బిఎల్ఐ ఎస్ సి కోర్సులకు సంబంధించి 12 సెప్టెంబర్ 2023 వరకు ఎలాంటి అపరాధ రుసుము లేకుండా 15 సెప్టెంబర్ 2023 వరకు 100 రూపాయల అపరాధ రుసుముతో ఫీజు చెల్లించాల్సి ఉంటుందని తెలిపారు. పీజీ ఒకటవ, మూడవ, ఐదవ సెమిస్టర్(థియరీ మరియు ప్రాక్టికల్) బ్యాక్ లాగ్ పరీక్షల రుసుం వివరాలను విద్యార్థులకు ఏ కోర్సు కు ఎంత రుసుం చెల్లించాలో తెలిపారు. విద్యార్థులు 2019-2020 రెండు సంవత్సరాల కోర్సుకు 2018-2019 మూడు సంవత్సరాల కోర్సు సంబంధించిన వివరాలు ఈ విధంగా ఉన్నాయి. ఎంఏ, ఎంఎస్‌డబ్ల్యూ, ఎమ్మెస్సీ, బిఎల్ఐఎస్సి ఐదు సంవత్సరాల ఇంటిగ్రేటెడ్ కోర్స్ ఒక్క పేపర్ కు 150, రెండు పేపర్లకు 300, అంతకు మించిన పేపర్లకు 500 చెల్లించాలని తెలిపారు. ఐదు సంవత్సరాల ఇంటిగ్రేటెడ్ కోర్స్(ఐపిసిహెచ్)/ ఎల్ ఎల్ ఎం, ఎల్ఎల్‌బి ఒక్క పేపర్‌కు 175, రెండు పేపర్లకు 350, అంతకుమించి పేపర్లకు 600 రూపాయలు చెల్లించాలని పేర్కొన్నారు. ఎంబీఏ, ఐఎంబీఏ, ఎంసీఏ ఒక్క పేపర్ కు 250- రెండు పేపర్లకు 500- అంతకు మించిన పేపర్లకు 800- రూపాయలు చెల్లించాల్సి ఉంటుందని తెలిపారు. ప్రతి విద్యార్థి తమ సర్టిఫికెట్లను జిరాక్స్ కాపీలను అందజేయాలని సూచించారు. మరిన్ని వివరాలకు విద్యార్థులు తమ కాలేజ్ ప్రిన్సిపాల్ ను సంప్రదించలన్నారు. పీజీ విద్యార్థులు ఒకటవ మూడవ, ఐదవ సెమిస్టర్‌కు సంబంధించిన వివరాలు తెలంగాణ యూనివర్సిటీలో బి చాలానా తీసుకొని రిజిస్ట్రార్ టీయూ ఎక్జమీనేషన్ అకౌంట్ ఈ అకౌంట్లో పే చేయగలరు. పూర్తి వివరాల కోసం. www. telanganauniversity. in. ac వెబ్‌సైట్‌లో పొందుపరచడం జరిగిందని తెలిపారు. తెలంగాణ యూనివర్సిటీ పరీక్షల నియంత్రణ అధికారిని ప్రొఫెసర్ డాక్టర్ ఎం అరుణ ఒక ప్రకటన తెలిపారు.



ధర్పల్లి : శ్రీవిద్య పాఠశాలలో..



ముప్కాల్ : న్యూహరిజోన్స్ పాఠశాలలో..



మోర్తాడ్ : ఉట్టికొడుతున్న చిన్నికృష్ణులు

గోకుల కృష్ణా.. గోపాలకృష్ణా..

- పాఠశాలల్లో ఘనంగా కృష్ణాష్టమి వేడుకలు
- ఉత్సాహంగా ఉట్టికొట్టిన చిన్నారులు

కృష్ణాష్టమి వేడుకలను నిజామాబాద్ జిల్లాలోని పాఠశాలల్లో బుధవారం ఘనంగా నిర్వహించారు. విద్యార్థులు కృష్ణుడు, గోపికల వేషాధారణలో అలరించారు. ఉట్టికొట్టే వేడుకలు నిర్వహించారు. గోకుల కృష్ణ, గోపాలకృష్ణ మాయలు చాలయ్య, ముకుందా.. ముకుందా అంటూ సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. పాఠశాల యాజమాన్యం, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నవతెలంగాణ-విలేకరులు

నిజామాబాద్‌సిటీ:నిజామాబాద్ నగరంలోని ఫ్యూచర్ లైన్ పాఠశాలలో విద్యార్థులు చిన్ని కృష్ణుని, గోపికల వేశాధారణతో అలరించారు. ప్రిన్సిపాల్ స్వప్న, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మోర్తాడ్:మండలంలోని కృష్ణవేణి పాఠశాల విద్యార్థులు గోపిక కృష్ణుడి వేషధారణలో పలువురిని ఆకట్టుకున్నారు. కృష్ణుడు, రాధా వేషధారణలో ర్యాలీ నిర్వహించి గ్రామంలోని ప్రధాన కూడలి వద్ద ఉట్టి కార్యక్రమాన్ని నిర్వహించారు.

ధర్పల్లి :మండలంలోని శ్రీవిద్య పాఠశాలలో చిన్ని కృష్ణుని వేశాధారణలో చిన్నారులు అలరించారు. కార్యక్రమంలో కరస్పాండెంట్ సాయి కృష్ణ, చైర్మన్ గోజూరి నడ్పి గంగాధర్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కమ్మర్‌పల్లి:మండల కేంద్రంలోని మిసిని, కృష్ణవేణి ఉన్నత పాఠశాలల్లో విద్యార్థిని విద్యార్థులతో గోపిక, కృష్ణుడు వేషధారణలు వేసి నృత్యాలు చేయించారు. అనంతరం ఉట్టికట్టి కృష్ణుడి వేషధారణలో ఉన్న విద్యార్థులతో ఉట్టిని కొట్టించారు. కార్యక్రమంలో మీసిమి పాఠశాలలో కరస్పాండెంట్ బాలే రవీందర్, ప్రిన్సిపాల్ చిలుక గంగా ప్రసాద్, వైస్ ప్రిన్సిపాల్ కుందారం సచిన్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఆర్మూర్ :పట్టణంలోని లిల్లీపుట్, నలంద, మానస పాఠశాలల్లో ఘనంగా నిర్వహించారు. విద్యార్థులందరూ చక్కగా కృష్ణుడు గోపికల్లాగా తయారై వచ్చి అందరిని అలరించారు. కార్యక్రమంలో కరెస్పాండెంట్ రామకృష్ణ, ప్రిన్సిపల్ దాస్ పాల్గొన్నారు.

ఇస్కాన్ ఆధ్వర్యంలో...

కృష్ణాష్టమి సందర్భంగా బాలాజీ ఫంక్షన్ హాల్ నందు ఇస్కాన్ ఆధ్వర్యంలో కృష్ణాష్టమి వేడుకలు ఘనంగా నిర్వహించడం జరిగింది. ఇట్టి కార్యక్రమంలో టిఆర్ఎస్ నియోజకవర్గ ఇన్చార్జి రాజేశ్వర్ రెడ్డి , మున్సిపల్ చైర్ పర్సన్ పండిత్ వినిత, బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

పట్టణంలోని మామిడిపల్లి నలంద పాఠశాలలో, గాంధీనగర్ లో గల ఆక్స్ఫర్డ్ పాఠశాల, హౌసింగ్ బోర్డ్ స్మైల్స్ పాఠశాలలో కృష్ణాష్టమి వేడుకలు సంబురంగా నిర్వహించినారు. ఈ కార్యక్రమంలో నలంద ప్రసాద్, సాగర్, మానస పరిపాలన అధికారిని పద్మ స్మైల్ పాఠశాల యజమాన్యం పాల్గొన్నారు.

ముప్కాల్:శ్రీ కృష్ణ జన్మాష్టమి వేడుకలను మండల కేంద్రంతోపాటు మండలంలో ఘనంగా నిర్వహించారు. మండలంలోని వేంపల్లి, రెంజర్ల, కొత్తపల్లి, వెంచిర్యాల, నల్లూరు గ్రామాల్లోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, ప్రాథమిక, కేజీబీవీ, ప్రయివేటు పాఠశాలల్లో విద్యార్థుల నడుమ శ్రీ కృష్ణ జన్మాష్టమి వేడుకలు చేపట్టారు. పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. మండలంలోని న్యూ హారిజోన్స్ పాఠశాల, కృష్ణవేణి టాలెంట్ స్కూల్, అంగన్‌వాడీ కేంద్రాలు, కేజీబీవీ, ప్రభుత్వ ఉన్నత ప్రాథమిక పాఠశాలలో వేడుకల్ని ఘనంగా నిర్వహించారు. వేంపల్లి సర్పంచ్ జక్క మల్లుబాయి-గంగాధర్ మనుమళ్లు కృష్ణుని వేషాధారణలో మురిపించారు.

ఏర్గట్ల:మండల కేంద్రంలోని ప్రాథమిక పాఠశాలలో శ్రీ కృష్ణ జన్మాష్టమి సందర్భంగా విద్యార్థులు శ్రీకృష్ణుడు, గోపికల వేషధారణలో సాంస్కృతిక కార్యక్రమాలతో అలరించారు. ఉట్టి కొట్టే కార్యక్రమంలో 5వ తరగతి విద్యార్థి ఎట్టెం శశాంక్ యాదవ్ ఉట్టికొట్టి బహుమతి గెలుపొందాడు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు బాలయ్య, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఆర్మూర్ : మండలంలోని గోవింద్‌పేట్ ప్రాథమిక పాఠశాలలో విద్యార్థిని విద్యార్థులకు శ్రీకృష్ణుడు, గోపిక, యశోద వేశాధారణలో సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు మాడవేడి పద్మావతి, ఉపాధ్యాయుల పాల్గొన్నారు.

నిజామాబాద్ సిటీ:పట్టణ కేంద్రంలో బ్రిలియంట్ గ్రామర్ హై స్కూల్ నందు శ్రీ కృష్ణాష్టమి సంబరాలను విద్యార్థులు కృష్ణుడిగా, గోపికలుగా వేషధారణలో పాల్గొని అందరిని అలరించారు. ఈ వేడుకలో ప్రిన్సిపల్ కేసరి రాజేంద్రప్రసాద్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



ఆర్మూర్ : లిల్లీపుట్ పాఠశాలలో..



కమ్మర్‌పల్లి : బ్రిలియంట్ పాఠశాలలో..



కమ్మర్‌పల్లి మండలంలో.. చిన్నికృష్ణులు, గోపికలు



ఏర్గట్లలో..

మైనారిటీ రెసిడెన్షియల్ భవనాల నిర్మాణ పనులు పరిశీలించిన కలెక్టర్

నవతెలంగాణ-కంఠేశ్వర్

జిల్లా కేంద్రంలోని ధర్మపురిహిల్స్ వద్ద కొనసాగుతున్న ప్రభుత్వ మైనారిటీ రెసిడెన్షియల్ పాఠశాలల భవన నిర్మాణాల పనులను కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు బుధవారం పరిశీలించారు. నిజామాబాద్ నగరంలో ఏడు మైనారిటీ పాఠశాలలు కొనసాగుతుండగా, వాటిలో బాలికల కోసం ఒకే చోట ధర్మపురిహిల్స్ వద్ద నాలుగు స్కూళ్లకు పక్కా భవనాలు నిర్మిస్తున్నారు. వాటిలో ఇప్పటికే ఒకదాని నిర్మాణం దాదాపు పూర్తయ్యింది. మరో మూడు పాఠశాలల పనులు తుది దశల్లో కొనసాగుతున్నాయి. ఈ నేపథ్యంలో కలెక్టర్ క్షేత్రస్థాయిలో పరిశీలించి, పనుల పురోగతి వివరాల గురించి అధికారులను అడిగి తెలుసుకున్నారు. తరగతి గదులు, డార్మెటరీ, లైబ్రరీ, ల్యాబ్ రూంలు, కిచెన్, డైనింగ్ హాల్, ర్యాంప్, టాయిలెట్స్ తదితర వాటిని క్షుణ్ణంగా పరిశీలించి, అధికారులకు, గుత్తేదారుకు పలు సూచనలు చేశారు. ఎలక్ట్రికల్, పెయింటింగ్ పనులను సైతం చేపట్టి యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేయాలని సూచించారు. ఒకచోట నిర్మాణ పనులకు అడ్డంకులు ఎదురవుతున్నాయని కాంట్రాక్టర్ తెలుపగా ఆ స్థలాన్ని పరిశీలించిన కలెక్టర్, అక్కడే అధికారులతో ఈ సమస్యలపై చర్చించారు. ప్రత్యామ్నాయ మార్గాల ద్వారా సమస్య పరిష్కరించుకోవాలని సూచించారు. నిర్ణీత గడువులోగా, నాణ్యతతో పనులు పూర్తయ్యేలా పర్యవేక్షణ జరపాలని ఆదేశించారు. కలెక్టర్ వెంట అదనపు కలెక్టర్ పి. యాదిరెడ్డి, నిజామాబాద్ ఆర్డీఓ రాజేంద్రకుమార్, ఇంజినీరింగ్ విభాగం ఈ.ఈ దేవిదాస్, ఏ.ఈ ఉదయ్ తదితరులు ఉన్నారు.



పనులను పరిశీలిస్తున్న కలెక్టర్

మగ్గిడిలో పంటల పరిశీలన

నవతెలంగాణ-ఆర్మూర్

మండలంలోని మగ్గిడి గ్రామంలో బుధవారం వ్యవసాయ అధికారి హరికృష్ణ పంటలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సోయాబీన్ పంటలో చేపట్టే సస్యరక్షణ చర్యలను రైతులకు వివరించారు. సోయాబీన్ పంటలో పల్లాకు తెగులు ఉత్పత్తిని రైతులు గమనించాలన్నారు. కార్యక్ర మంలో సర్పంచ్ సుద్దపల్లి శ్రీనివాస్, రైతులు చిన్నారెడ్డి, సుమన్, భూమన్న, గంగాసాగర్ తదితరులు పాల్గొన్నారు.



సోయాబీన్ పంటను పరిశీలిస్తున్న వ్యవసాయాధికారి

అంగన్‌వాడీల్లో పోషకాహార వారోత్సవాలు

- కృష్ణాష్టమి వేడుకలు అన్నప్రాసన, వెల్ బేబీ షో

నవతెలంగాణ-విలేకరులు

బాల్కొండ:పోషక మాసం సందర్భంగా మండలంలోని చిట్టాపూర్ గ్రామంలో మహిళలకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో భాగంగా గర్భిణులు, బాలింతలకు, మహిళలకు పౌష్టికాహారం, తల్లిపాల గురించి అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా జిల్లా సంక్షేమ అధికారిని రసూల్ బి పాల్గొన్నారు . ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పౌష్టిక ఆహారం తీసుకోవడం వలన వచ్చే లాభాలను, విటమిన్ల ప్రాముఖ్యత వివరించారు. అనంతరం శ్రీ కృష్ణాష్టమి వేడుకలను కూడా నిర్వహించారు. కార్యక్రమంలో సర్పంచ్ వనజా, సిడిపిఓ భార్గవి, సూపర్వైజర్ శ్రీదేవి, అంగన్వాడి టీచర్లు ,ఆశా వర్కర్లు, తదితరులు పాల్గొన్నారు.

కమ్మర్‌పల్లి:మండలంలోని ఉప్లూర్ అంగన్వాడీ కేంద్రంలో పోషణ మాసంలో భాగంగా బుధవారం కృష్ణాష్టమి పండుగ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా చిన్ని కృష్ణుడు, గోపికల వేషధారణలో ఉన్న చిన్నారులు తమ ఆటలతో అలరించారు. చిన్ని కృష్ణుని వేషధారణతో ఉన్న చిన్నారులతో ఉట్టి కొట్టించే కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం వెల్ బేబీ షో, పలువురు చిన్నారులకు అన్నప్రాసన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా భీంగల్ ఐసిడిఎస్ మండల పర్యవేక్షకురాలు సరస్వతి చిన్నారుల తల్లులు, గర్భవతులను పోషణ మాసంపై అవగాహన కల్పించారు. అర్హులైన ప్రతి ఒక్కరు అంగన్వాడీ కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. అంగన్వాడి కేంద్రాల ద్వారా గర్భిణీలు, బాలింతలకు పౌష్టికాహారంతోపాటు చిన్నారులకు ఆటపాటలతో, క్రమశిక్షణతో కూడిన విజ్ఞానం అందుతుందన్నారని అన్నారు. గర్భిణీలు, బాలింతలు పోషకాలతో కూడిన పౌష్టికాహారాన్ని తీసుకోవడంవల్ల పుట్టబోయే, పుట్టిన బిడ్డలు ఆరోగ్యంగా ఉంటారన్నారు. కార్యక్రమంలో అంగన్వాడీ టీచర్లు సరిత, శోభా, పద్మ ఆయాలు, తదితరులు పాల్గొన్నారు.



కంఠేశ్వర్ : జలాల్‌పూర్ అంగన్‌వాడీలో..

కంఠేశ్వర్:పోషణ మాసం సందర్భంగా నిజామాబాద్ రూరల్ మండలం జలాల్పూర్ అంగన్వాడి కేంద్రంలో బుధవారం కృష్ణాష్టమి వేడుకలను ఘనంగా నిర్వహించినట్లు నిజామాబాద్ అర్బన్ ప్రాజెక్టు సిడిపిఓ సౌందర్య తెలిపారు. ముర్రుపాల గురించి తల్లిపాలు 6 నెలల వరకు కచ్చితంగా బిడ్డలకు ఇవ్వాలని అన్నారు. ఆ తర్వాత కూడా తల్లిపాలతో పాటు అనుబంధ పోషకాహారం అందించాలని లబ్ధిదారులకు తెలిపారు. గర్భిణీ బాలింతలు కచ్చితంగా అంగన్వాడి కేంద్రంలో భోజనం చేయాలని అన్నారు. ఐరన్ మరియు ఫోలిక్ యాసిడ్ టాబ్లెట్లను వేసుకోవాలని తెలిపారు. గర్భిణీలు నాలుగు చెకప్ లు చేసుకోవాలని గవర్నమెంట్ హాస్పిటల్ నందు డెలివరీ చేసుకోవాలని సూచించారు. దాంతోపాటు బరువు ఎత్తులు తూచిన పిల్లలను నార్మల్ గా ఉన్న పిల్లలను గుర్తించి వెల్ బేబీ షో కార్యక్రమం నిర్వహించి వారికి బహుమతులు అందజేశారు. కృష్ణాష్టమి వేడుకల్లో భాగంగా అంగన్వాడి పిల్లలతో ఉట్టి కొట్టే కార్యక్రమం నిర్వహించారు.



కమ్మర్‌పల్లి : ఉప్లూర్ అంగన్‌వాడీలో...

ఏర్గట్ల:అంగన్వాడీ పోషణ మాస వారోత్సవాల్లో భాగంగా తాళ్ళ రాంపూర్ అంగన్వాడీ కేంద్రంలో ఐసీడీఎస్ సూపర్ వైజర్ నాగలక్ష్మి హాజరై మాట్లాడుతూ... పుట్టిన పసిపాపలకు ఆరునెలల వరకు ఎలాంటి ద్రవ పదార్థాలు తాగించవద్దని కేవలం తల్లిపాలు తాగించాలని అన్నారు.గర్భిణీలు మొదటి నెల నుండి తొమ్మిది నెలల పాటు తగు జాగ్రత్తలు పాటించాలని సూచించారు. పుట్టిన శిశువుకు కచ్చితంగా ముర్రుపాలు తాగించాలని కోరారు. కార్యక్రమంలో గర్భిణీలు, బాలింతలు పాల్గొన్నారు.

తాత్కాలిక ఉపాధ్యాయ పోస్టులకు దరఖాస్తుల స్వీకరణ

నవతెలంగాణ-తాడ్వాయి

జిల్లాలోని గిరిజన సంక్షేమ గురుకుల ఎల్లారెడ్డి (బాలికల), బాన్సువాడ (బాలుర) పాఠశాల/జూనియర్ కళాశాలల్లో ఖాళీగా ఉన్న ఉపాధ్యాయ పోస్టులను పూర్తి తాత్కాలిక పద్ధతిన ఈ విద్యా సంవత్సరం కొరకు పనిచేసే వారి నుంచి దరఖాస్తులను స్వీకరిస్తున్నట్లు జిల్లా అదనపు కలెక్టర్ చంద్రమోహన్ ఒక ప్రకటనలో తెలిపారు. ఎల్లారెడ్డిలోని బాలికల పాఠశాల/జూనియర్ కళాశాలలో (01) జువాలజీ, (01) కెమిస్ట్రీ, (01) బోటని, (01) ఇంగ్లీష్, (01) ఫిజికల్ సైన్స్, బాన్స్వాడ బాలుర పాఠశాల/ జూనియర్ కళాశాలలో (01) కామర్స్, (01) ఇంగ్లీష్ సబ్జెక్టులో బోధించేందుకు పీజీ 50శాతం మార్కులతో, బీఈడీ, టెట్‌లో ఉత్తీర్ణులైన ఆసక్తి గల అభ్యర్థులు ఈ నెల 13లోపు మెదక్‌లోని మినీ గురుకులంలో గల ఆర్‌సీఓ కార్యాలయంలో (కోర్టురోడ్డు) దరఖాస్తులు సమర్పించాలని కోరారు. బాలికల పాఠశాలల్లో మహిళలకు మాత్రమే అర్హత ఉందని తెలిపారు. అభ్యర్థుల ఎంపిక డెమో మెరిట్ ఆధారంగా పారదర్శకంగా జరుగుతుందని వివరించారు.

ఉపాధ్యాయులను సన్మానించిన ప్రొఫెసర్

నవతెలంగాణ-సదాశివనగర్


ఉపాధ్యాయులకు సన్మానం

ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకొని ఉపాధ్యాయులను శ్రీ సాందీపని డిగ్రీ కళాశాలలో ప్రొఫెసర్ డాక్టర్ కే రామ్‌సింగ్ ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో హరీష్మాన్‌రెడ్డి, రామస్వామి, బలరాం, సాయిరెడ్డి, సాయిబాబా, సిద్దిక్ రాథోడ్, అశోక్‌సింగ్, సుధాకర్‌రావ్, ప్రకాశ్ తదితరులు పాల్గొన్నారు.

ఓటర్లకు ఇబ్బందులుండొద్దు

- అదనపు కలెక్టర్ మను చౌదరి
- పోలింగ్ కేంద్రాల పరిశీలన

నవతెలంగాణ-బిచ్కుంద


పోలింగ్ కేంద్రాలను పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్

పోలింగ్ కేంద్రాలకు వచ్చే ఓటర్లకు ఇబ్బందులుండొద్దని అదనపు కలెక్టర్ మను చౌదరి అన్నారు. బుధవారం మండలంలోని మెక్కా గ్రామంతో పాటు మండల కేంద్రంలోని పోలింగ్ కేంద్రాలను కామారెడ్డి జిల్లా అదనపు కలెక్టర్ మనుచౌదరి పరిశీలించారు. పోలింగ్ కేంద్రాలకు ఓటు వేయడానికి వచ్చిన ఓటర్లకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా తాగునీటి వసతి, స్త్రీలు, పురుషుల కోసం వేరువేరుగా మరుగుదొడ్లు, వికలాంగులకు ఇబ్బంది కలగకుండా వీల్ చైర్లు అందుబాటులో ఉంచాలని, పోలింగ్ కేంద్రాల వద్ద రైలింగ్ తప్పనిసరిగా ఏర్పాటు చేయాలని అధికారులకు సూచించారు. మండలంలో ఎన్ని పోలింగ్ కేంద్రాలున్నాయి, పోలింగ్ కేంద్రాలలో ఏమైనా సమస్యలు ఉన్నాయా అని అడిగి తెలుసుకున్నారు. ఎలాంటి సమస్యలున్నా తన దృష్టికి తీసుకురావాలని, మరుగుదొడ్లు లేని పోలింగ్ కేంద్రాలను గుర్తించి నివేదిక ఇవ్వాలని, ఎన్ఆర్ ఈజీఎస్ కింద మరుగుదొడ్లు మంజూరు చేయనున్నట్టు తెలిపారు. అందువల్ల మరుగుదొడ్లను వెంటనే నిర్మించాలన్నారు. తాగునీటి వసతి లేని చోట మిషన్ భగీరథ ద్వారా నల్లా కలెక్షన్లు ఏర్పాటు చేయాలన్నారు. ఓటర్లకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ముందస్తుగానే ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలని అధికారులకు సూచించారు. అనంతరం తహసీల్దార్ కార్యాలయం సందర్శించి రిజిస్ట్రేషన్ ప్రక్రియ తదితర విషయాలను పరిశీలించారు. ఆయన వెంట తహసిల్దార్ లక్ష్మణ్, ఎండిఓ ఆనంద్, డిప్యూటీ తహసిల్దార్ భరత్, ఆర్ఐ సాయిబాబా, సీనియర్ అసిస్టెంట్ శీతల్, రెవెన్యూ, గ్రామపంచాయతీ సిబ్బంది ఉన్నారు.

విద్యార్థినిలతో మాట్లాడిన అదనపు కలెక్టర్..

పోలింగ్ బూత్‌ల పరిశీలనలో భాగంగా ప్రభుత్వ బాలికల పాఠశాలలో 10వ తరగతి విద్యార్థులతో అదనపు కలెక్టర్ మనో చౌదరి మాట్లాడారు. పాఠశాలలోని పదో తరగతి విద్యార్థినులు ఎంతమంది ఉన్నారని హాజరు శాతం ఎంత ఉందని ఉపాధ్యాయులకు అడిగారు. చక్కగా చదువుకోని తమ లక్ష్యాలను సాధించాలని ఈ సందర్భంగా విద్యార్థినులకు సూచించారు.

చేతిపంపు నుంచి ఉబికి వస్తున్న నీరు


చేతిపంపు నుంచి నీరు

నవతెలంగాణ-సురుల్లాబాద్

ఇటీవల కురిసిన భారీ వర్షాలకు గ్రామపంచాయతీ మంచినీటి చేతి పంపు బోరు బావి నుంచి నీరు దానంతట అదే ఉబికి వస్తుంది. కామారెడ్డి జిల్లా బాన్సువాడ నియోజకవర్గంలోని నసురుల్లాబాద్ మండల కేంద్రంలోని బాన్సువాడ వెళ్లే రహదారి పక్కనే గ్రామస్తుల మంచినీటి సౌకర్యం కోసం గత ఐదు సంవత్సరాల క్రితం బోరు తవ్వించారు. ఇటీవల కురిసిన వర్షాలకు చేతి పంపును ఆడించకుండానే దానంతట అవే నీరు పైకి వస్తోంది. దీంతో అటుగా వెళ్ళే వాహన చోదకులను, ప్రజలను ఆకట్టుకుంటోంది. అనేకమంది అలా వస్తున్న నీటిని నీళ్ల బాటిల్స్‌లో పట్టుకొని తమ వెంట తీసుకువెళుతున్నారు. అదేవిధంగా సమీపంలోని మరొక బోరు బావి నుంచి కూడా ఇదే విధంగా పాతాళగంగా ఉబికి పైకి వస్తున్న దృశ్యాలు అందరినీ ఆకట్టుకుంటున్నాయి.

ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో హెచ్‌బీఎన్‌సీ కిట్లు అందజేత


కిట్లు అందజేస్తున్న డాక్టర్ వినయ్‌కుమార్

నవతెలంగాణ-రెంజల్

రెంజల్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో డాక్టర్ వినయ్ కుమార్ ఆశలకు (హెచ్‌బీఎన్‌సీ) కిట్లను అందజేశారు. జాతీయ ఆరోగ్య మిషన్ కింద, గృహ ఆధారిత నవజాత సంరక్షణ కిట్లను అందజేసినట్టు ఆయన పేర్కొన్నారు. గ్రామీణ ప్రాంతాలలోని నవజాత శిశుమరణాలను తగ్గించడానికి వీటిని అందజేసినట్లు ఆయన తెలిపారు. దీనిలో శిశువు ఎత్తు బరువులను కొలిచే మిషన్, టార్చ్‌లైట్, బేబీ టీమర్, శరీర ఉష్ణోగ్రతను చూడడానికి థర్మామీటర్, బేబీ బెడ్, బ్లాంకెట్ తదితర వస్తువులు ఉంటాయని తెలిపారు. కార్యక్రమంలో ఏజీవో చింతల శ్రావణ్‌కుమార్, ఆరోగ్య సూపర్‌వైజర్ మాలంబి, ఆశలు స్రవంతి, లావణ్య తదితరులున్నారు.

పౌష్టికాహారంపై అవగాహన


కృష్ణాష్టమి వేడుకలు..

నవతెలంగాణ-రెంజల్

మండలంలోని కిసాన్ తాండ గ్రామంలో గర్భిణులకు, బాలింతలకు పౌష్టికాహారంపై బుధవారం అవగాహన కల్పించినట్టు ఐసిడిఎస్ సూపర్‌వైజర్ ప్రమీల రాణి తెలిపారు. శ్రీకృష్ణ జన్మాష్టమిని పురస్కరించుకొని చిన్నారులకు వేషాధారణ పలువురిని ఆకర్షించింది. పోషణ మాసాన్ని పురస్కరించుకొని గర్భిణులకు, బాలింతలకు పౌష్టికాహారం వలన కలిగే లాభాల గురించి వివరించారు. ప్రతిరోజు అంగన్వాడీ కేంద్రంలో చిన్నారులకు, గర్భిణులకు పౌష్టికాహారాన్ని అందజేయాలని అంగన్వాడీ టీచర్‌ను ఆదేశించారు. ప్రతిరోజు పిల్లల ఎత్తులు బరువులను కలిసి తగిన ఆహారాన్ని అందించాలన్నారు. అంగన్వాడీలో కిచెన్ గార్డెన్‌తో పాటు, మహిళలు తమ ఇంటి ఆవరణలో కూరగాయలు సాగు చేసుకోవాలని ఆమె సూచించారు. మూడు నుంచి ఐదు సంవత్సరాలలోపు పిల్లలందరూ అంగన్వాడీ కేంద్రంలోని చేర్పించాలని, ప్రైవేట్ పాఠశాలకు పంపకూడదని వారికి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సర్పంచ్ మలావత్ జమున, ఏఎల్ఎంఎస్‌సీ కమిటీ సభ్యులు, పాఠశాల ప్రధానోపాధ్యాయులు, అంగన్వాడీ టీచర్ తదితరులు పాల్గొన్నారు.

పారిశుధ్య పనులు నామమాత్రం

- సభాదృష్టికి తెచ్చిన జడ్పీటీసీ
- పిట్లం మండల సర్వసభ్య సమావేశం

నవతెలంగాణ-పిట్లం


మాట్లాడుతున్న జడ్పీటీసీ

వర్షాకాలం ప్రారంభమై మూడు నెలలు కావస్తున్నా పారిశుధ్య పనులు నామమాత్రంగా నిర్వహిస్తున్నారని మండల పంచాయతీ అధికారి బ్రహ్మంపై జడ్పిటిసి శ్రీనివాస్‌రెడ్డి మండిపడ్డారు. బుధవారం మండల పరిషత్ సర్వసభ్య సమావేశాన్ని ఎంపీపీ కవితా విజయ్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా పంచాయతీల అభివృద్ధిపై ఎంపిఓ సమీక్షిస్తుండగా స్పందించిన జడ్పిటిసి గ్రామాలలో చెట్లు, చెత్తా చెదారంతో నిండుకున్నాయని, బ్లీచింగ్ పౌడర్ చల్లటం లేదని, కాలువలు మురికితో నిండుకుని కంపు కొట్టడమే కాకుండా విపరీతమైన దోమలతో ప్రజలు అల్లాడుతున్నారని, అయినా సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారని మండిపడ్డారు. అందుకు ఎంపిఓ బదులిస్తూ త్వరలో చెట్లు, మురికి కాలువల పరిశుభ్రత నిర్వహించేలా పంచాయతీ కార్యదర్శులకు ఆదేశించనున్నట్టు తెలిపారు. పశుసంవర్ధక శాఖపై వైద్యాధికారి సంతోష్ మాట్లాడుతూ.. వర్షాలు తగ్గగానే పశువులకు టీకాలు అందజేస్తామని, ప్రభుత్వ ఆదేశానుసారంగా గొర్రెల పంపిణీ చేసి నిర్దేశిత లక్ష్యాలను చేస్తామని తెలపడంతో స్పందించిన జడ్పిటిసి సంచార పశు వైద్య అంబులెన్స్ మొబైల్ నెంబర్ తెలియక రైతులు ఆందోళన చెందుతున్నారని ప్రశ్నించారు. అందుకు వైద్యాధికారి బదులిస్తూ పశు వైద్యశాల, ప్రధాన కూడలిలో, అక్కడక్కడ గోడలపై మొబైల్ నెంబర్ ఉండేలా జాగ్రత్తలు తీసుకుంటామన్నారు. విద్యుత్తు సమస్యలు తలెత్తినా, రోడ్లకిరువైపులా విద్యుత్ వైర్లు కిందకు వేలాడుతున్నాయని వాటిని సరిచేయాలని పలుమార్లు విన్నవించినప్పటికీ ఏఈ బుచ్చిబాబు స్పందించడం లేదని సర్పంచులు ఆరోపించారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ లచ్చిరెడ్డి, డిసిసిబి డైరెక్టర్ సాయిరెడ్డి, ఎంపీడీవో వెంకటేశ్వర్లు, ఆయా గ్రామాల సర్పంచులు, ఎంపీటీసీలు, ప్రభుత్వ శాఖల అధికారులు పాల్గొన్నారు.

జాగ్రత్తలు పాటిస్తే.. అధిక దిగుబడి

- పంటలను పరిశీలించిన జిల్లా వ్యవసాయ అధికారిణి

నవతెలంగాణ-తాడ్వాయి


పంటలను పరిశీలిస్తున్న జిల్లా వ్యవసాయాధికారి

పంట రక్షణలో జాగ్రత్తలు పాటిస్తే అధిక దిగుబడులు సాధించవచ్చని జిల్లా వ్యవసాయ అధికారిణి భాగ్యలక్ష్మి తెలిపారు. బుధవారం మండలంలోని సోమారం గ్రామంలో వరి, మొక్కజొన్న, పత్తి, సోయాచిక్కుడు పంటలను సందర్శించారు. కొద్దిరోజులుగా కురుస్తున్న వర్షాలకు వివిధ పంటల్లో గమనించిన చీడపీడలు, అలాగే పోషక లోపాలు సవరణ గురించి వివరించారు. ముఖ్యంగా వరిలో కాండం తొలుచు పురుగు ఉధృతిని గమనించారు. దాని నివారణకు రైతులు పాటించవలసిన మెలకువలను సూచించారు. మొక్కజొన్న అధికంగా కురిసిన వానలకు నీరు నిలవడంతో ఆకులు ఊదా రంగులోకి మారి భాస్వరం లోపాలను గమనించారు. అలాగే కత్తెర పురుగు ఉధృతిని సైతం గమనించారు. సోయా చిక్కుడులో పల్లాకు తెగులు గమనించారు. దీని నివారణకు ఎకరానికి 300గ్రాములు అసిఫేట్ లేదా ఎకరానికి 40గ్రాముల అసిటామాప్రిడ్ పిచికారీ చేసుకోవాలని సూచించారు. పత్తిలో అధిక వర్షాలకు మొక్కల ఎదుగుదల తక్కువగా ఉండడం గమనించారు. వర్షాలు తగ్గిన వెంటనే యూరియా 20 గ్రాములు లీటర్ నీటికి లేదా 19:19:19 10 గ్రాములు లీటర్ నీటికి కలుపుకొని పిచికారీ చేసుకోవాలని అన్నారు. అలాగే వ్యవసాయ శాఖ సూచించిన విధంగా జాగ్రత్తలు తీసుకున్నట్లయితే పంటను వివిధ రకాల చీడపీడలు నుంచి కాపాడుకుని మంచి దిగుబడి సాధించే అవకాశం ఉందని రైతులకు సూచించారు. కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణ అధికారి లికిత్‌రెడ్డి, సోమరం సర్పంచ్ బద్దం చరణ్‌రెడ్డి, రైతులు గణేష్, బస్వరాజు, రాజు, సిద్దిరాములు, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

బిచ్కుందలో అంతర్ రాష్ట్ర పోలీసు అధికారుల సమావేశం

నవతెలంగాణ-బిచ్కుంద


సమావేశంలో పోలీసు అధికారులు

మండల కేంద్రంలోని పోలీస్ సర్కిల్ కార్యాలయంలో బాన్సువాడ డీఎస్పీ జగన్నాథ్‌రెడ్డి ఆధ్వర్యంలో పొరుగు రాష్ట్రాలైన కర్ణాటక, మహారాష్ట్ర అంతర్‌రాష్ట్ర సరిహద్దుల పోలీస్ అధికారులతో సమావేశం నిర్వహించారు. తెలంగాణ రాష్ట్రంలో రాబోయే అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా రాష్ట్ర సరిహద్దుల్లో చెక్ పోస్టుల నిర్వహణ, అంతరాష్ట్ర దొంగల సమాచారం, దొంగతనాలు, హత్యలు, ఇతర కేసుల్లో సమాచారం సేకరణ తదితర విషయాలను సమావేశంలో చర్చించారు. ఈ సమావేశంలో నారాయణఖేడ్ డీఎస్పి వెంకటరెడ్డి, దెగ్లూర్ సిఐ సంజయ్ హిబ్బరే, మరికల్ సీఐ బౌరాత్, బిచ్కుంద ఎస్సై మురళి, సంగారెడ్డి జిల్లా కంగ్టీ సర్కిల్ పోలీస్ అధికారులు, నిజామాబాద్ జిల్లా రుద్రూర్ సర్కిల్ పోలీస్ అధికారులు, బిచ్కుంద సర్కిల్ పరిధిలోని పోలీసు అధికారులు పాల్గొన్నారు.

సీఎం కేసీఆర్, ఎమ్మెల్యే చిత్రపటాలకు పాలాభిషేకం

నవతెలంగాణ-రెంజల్


చిత్రపటాలకు పాలాభిషేకం చేస్తున్న దృశ్యం

షెడ్యూల్ ట్రైబ్ డెవలప్‌మెంట్ నిధుల కింద బోధన్ నియోజకవర్గానికి 15 కోట్ల 40 లక్షల రూపాయలు మంజూరు చేసిన సీఎం కేసీఆర్, దీనికి తమ సహాయ సహకారాలను అందజేసిన బోధన్ ఎమ్మెల్యే మహమ్మద్ షకీల్ అమీర్ చిత్రపటాలకు బీఆర్ఎస్ మండల పాలాభిషేకం నిర్వహించారు. బుధవారం మండలంలోని వీరన్నగుట్ట తండా సర్పంచ్ జాదవ్ గణేష్ నాయక్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బోధన్ నియోజకవర్గానికి గిరిజన తండాల లింక్ రోడ్ల నిమిత్తం 15 కోట్ల 40 లక్షల రూపాయలు మంజూరు కాగా, రెంజల్ మండలంలోని గిరిజన తండాలకు 9కోట్ల 50లక్షల రూపాయలను కేటాయించడం అభినందనీయమని ఆయన పేర్కొన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షులు భూమారెడ్డి, సర్పంచులు ఎమ్మెస్ రమేష్ కుమార్, వికార్‌పాషా, పాముల సాయిలు, బైండ్ల రాజు, స్థానిక నాయకులు రొడ్డలింగం, రఫిక్, కృష్ణారావు, విజయ్, భూమేష్, బాబునాయక్, జాదవ్‌రాజు తదితరులు పాల్గొన్నారు.

ఆలయ అభివృద్ధికి భక్తుల విరాళం

నవతెలంగాణ-భిక్కనూర్

మండల కేంద్రంలోని దక్షిణ కాశీ శ్రీ సిద్ధరామేశ్వర ఆలయ అభివృద్ధికి రామేశ్వర్‌పల్లి గ్రామానికి చెందిన వసంత శేఖర్ దంపతులు 11,001 రూపాయల విరాళాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఆలయ పీఠాధిపతి మాంతప్ప, ఆలయ పునర్‌నిర్మాణ కమిటీ చైర్మన్ మహేందర్‌రెడ్డి దంపతులను శాలువాతో సత్కరించి, స్వామివారి ప్రతిమను, తీర్థప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో ఆలయ అర్చకులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

రవీంద్ర భారతి పాఠశాలలో కృష్ణాష్టమి


కృష్ణాష్టమి వేడుకల్లో చిన్నారులు

నవతెలంగాణ-తాడ్వాయి

మండల కేంద్రంలోని రవీంద్ర భారతి ఉన్నత పాఠశాలలో శ్రీకృష్ణాష్టమి ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. చిన్నారులంతా శ్రీ కృష్ణుని వేషధారణలో, అందమైన గోపికమ్మల వేషధారణలో అలరించారు. ఈ ఉత్సవంలో భాగంగా చిన్నారులు ఉట్టి కొట్టారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రిన్సిపాల్ ఆది స్వామి మాట్లాడుతూ.. ద్వాపర యుగంలో బహుళ అష్టమి శ్రీకృష్ణుడు జన్మించాడని, దేవకీ వసుదేవులకు అష్టమ సంతానమని, శ్రీ కృష్ణుడు శ్రీ మహావిష్ణువు అవతారమని తెలిపారు. కరెస్పాండెంట్ భాస్కర్‌గౌడ్ శ్రీ కృష్ణాష్టమి రోజు పిల్లలందరూ మరింత ఉత్సాహంతో పాల్గొనేలా ప్రోత్సహించారు. ఈ ఉత్సవంలో పాఠశాల ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ ఉద్యోగులను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలి


వినతిపత్రం అందజేస్తున్న అంగన్‌వాడీ ఉద్యోగులు

నవతెలంగాణ-జుక్కల్

అంగన్‌వాడీ ఉద్యోగులను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని సీఐటీయూ జిల్లా నాయకుడు సురేష్ గొండ అన్నారు. బుధవారం అంగన్‌వాడీ టీచర్ల సమస్యలపై జుక్కల్ తహసీల్దార్ గంగాసాగర్ మండలంలోని అంగన్‌వాడీ టీచర్లతో కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సురేష్ గొండ మాట్లాడుతూ.. అంగన్‌వాడీ టీచర్లకు ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించి, రూ.26వేల వేతనం ఇవ్వాలని, పలు డిమాండ్లతో కూడిన డిమాండ్లను ఈనెల పదవ తేదీ వరకు చేయాలని, లేకుంటే 11వ తేదీన నుంచి నిరవధిక సమ్మె చేస్తామని వినతిపత్రాన్ని తహసీల్దార్‌కు అందజేశారు. కార్యక్రమంలో జుక్కల్, పెద్దఎడ్గి సెక్టార్ అంగన్‌వాడీ టీచర్లు సుమలత, లక్ష్మీ, అనిత, చంద్రకళ, అంబవ్వ, కంశవ్వ, హన్మవ్వ, సాయవ్వ లత మండలంలోని అన్ని అంగన్‌వాడీ కేంద్రాల టీచర్లు తదితరులు పాల్గొన్నారు.

బహుజన సమాజ్ పార్టీ మండలాధ్యక్షునిగా కడిగే రాజు

నవతెలంగాణ-లింగంపేట్


కడిగె రాజుకు సన్మానం

బహుజన సమాజ్ పార్టీ మండల అధ్యక్షుడిగా శెట్టిపల్లి గ్రామానికి చెందిన కడిగే రాజును ఏకగ్రీవంగా బుధవారం ఎన్నుకున్నారు. కామారెడ్డి జిల్లా లింగంపేట్ మండల కేంద్రంలో బహుజన సమాజ్ పార్టీ ఎల్లారెడ్డి పట్టణ అధ్యక్షులు మార్లు సాయిబాబు, అంబేద్కర్ సంఘం ఎల్లారెడ్డి డివిజన్ సీనియర్ నాయకులు కొంగట్టి సంజీవులు, బహుజన సమాజ్ పార్టీ నుంచి లింగంపేట్ మండలాధ్యక్షులుగా నూతనంగా ఎన్నికైన కాడిగె రాజును మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సన్మానించారు. భారత రాజ్యాంగం పుస్తకమును బహూకరించారు. ఈ సందర్భంగా నూతనంగా ఎన్నికైన కాడిగె రాజు మాట్లాడుతూ కామారెడ్డి జిల్లా అధ్యక్షులు బట్టంకి బాలరాజు తనపైన పెట్టిన ఈ మండల పదవిని సక్రమంగా నిర్వహిస్తూ ప్రజల పట్ల సోదర భావంతో మెదలుకొని లింగంపేట్ ప్రజలను బహుజన్ సమాజ్ పార్టీ వైపు నడిపిస్తానని తెలిపారు.

పీహెచ్‌సీలో రోగులకు విధివిధానాల కూర్పు


మాట్లాడుతున్న ఎంపీపీ

నవతెలంగాణ-జుక్కల్

మండలంలోని జేఏఎస్ కామారెడ్డి జిల్లా బాన్సువాడ డివిజన్ డిప్యూటీ డీఎంఅండ్‌హెచ్‌వో శిరీష ఆధ్వర్యంలో మండల కేంద్రంలోని రైతువేదికలో శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎంపీపీ సుర్నార్ యశోదా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన జాస్ కమిటీ శిక్షణ సమావేశంలో డిప్యూటీ డీఎంఅండ్‌హెచ్‌వో శిరీష మాట్లాడుతూ.. ప్రాథమిక ఆసుపత్రిలో, ఆరోగ్య ఉప కేంద్రాలలో జాష్ కమిటీ రోగికి అందిచాల్సిన సేవలు కొనసాగింపు, జాష్ కూర్పు, వైద్య ఆరోగ్య శాఖను బలోపేతం చేసే దిశగా విదివిధానాలను, ఆయుష్మాన్ భారత్ కింద ప్రతి ఆరోగ్య ఉప కేంద్రాలు, పల్లె దావఖానాలు రూపు దిద్దుకోవడం, నిశ్నార్థులైన వైద్య సిబ్బందితో మెరుగైన సేవలు అందించడం లక్ష్యంగా పనిచేయాలని సూచించారు. ఎంపీపీ యశోద మాట్లాడుతూ.. ప్రతి మూడవ శనివారం పల్లె దవఖానాలలో సిస్టర్లు సమావేశాలు నిర్వహించుకోవాలని, కమిటీ అందరినీ సమన్వయ పరిచే బాధ్యత సంబంధిత డాక్టర్, సిస్టర్లదేనని అన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ, డిప్యూటీ డీఎంఅండ్‌హెచ్‌వో, స్థానిక సర్పంచ్ బొంపెలి రాములు, మాదాపూర్ జల్దేవార్ దినేష్, రవిపటేల్, స్టాఫ్‌నర్స్ యోగేష్, వైద్యసిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఆర్థిక సహాయం చెక్కు అందజేత


చెక్కు అందజేస్తున్న ప్రజాప్రతినిధి

నవతెలంగాణ-కమ్మర్‌పల్లి

మండలంలోని అమీర్ నగర్ గ్రామానికి చెందిన గుర్రం బాబాయ్ అనే మహిళకు పెరాలసిస్ వ్యాధి రావడంతో నిజామాబాద్ లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స తీసుకుంది. ఆస్పత్రి ఖర్చుల నిమిత్తం ముఖ్యమంత్రి సహాయ నిధి పథకం కింద మంత్రి 70వేల చెక్కు మంజూరు చేయించారు. ఆ చెక్కును బుధవారం గ్రామ శాఖ అధ్యక్షుడు గంగం గంగారెడ్డి, సర్పంచ్ పుప్పాల గంగాధర్ చేతుల మీదుగా లబ్ధిదారుకు అందజేశారు. కార్యక్రమంలో సింగిల్ విండో వైస్ చైర్మన్ ఆకుల రాజన్న, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ మాలవత్ ప్రకాష్, గ్రామ రైతు కోఆర్డినేటర్ క్యాతం రాజేందర్, వార్డు మెంబర్ క్యాతం గంగారెడ్డి, బిఆర్ఎస్ మాజీ గ్రామ శాఖ అధ్యక్షుడు బెజ్జరపు సత్యం, పార్టీ యువ నాయకులు పాల్గొన్నారు.

వ్యాయామ ఉపాధ్యాయులను అభినందించిన జిల్లా అధ్యక్షులు

నవతెలంగాణ-ఆర్మూర్

చదువుతోపాటు విద్యార్థులకు క్రీడల్లో మంచి శిక్షణ ఇచ్చిన ఉపాధ్యాయులను మంత్రి ప్రశాంత్ రెడ్డి, కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా అభినందించడం హర్షనీయమని జిల్లా వ్యాయామ ఉపాధ్యాయుల సంఘం అధ్యక్షులు టి. విద్యాసాగర్ రెడ్డి బుధవారం తెలిపారు. ఎం. సురేష్ కుమార్ జెడ్పిహెచ్ఎస్ పడగల్, ఎం. గంగా మోహన్-జెడ్పిహెచ్ఎస్ మిట్టపల్లి, యాదగిరి-జెడ్పిహెచ్ఎస్ కలిగోట్, శ్యామ్ జెడ్పిహెచ్ఎస్ మెండోరా, ఎస్.రమణ-జెడ్పిహెచ్ఎస్ ముచ్కుగూర్‌ను అభినందించినట్టు తెలిపారు.కార్యక్రమంలో జిల్లా స్కూల్ గేమ్స్ కార్యదర్శి కె సంగీతరావు, కోశాధికారి రాజేందర్, జిల్లా సాఫ్ట్ బాల్ అసోసియేషన్ ఉపాధ్యక్షులు జైపాల్ రెడ్డి, సంయుక్త కార్యదర్శి మర్కంటి సుజాత, వ్యాయామ ఉపాధ్యాయులు మధు, భూపతి, సురేందర్, వీణ పాల్గొన్నట్టు తెలిపారు.

సదరం క్యాంపునకు హాజరయ్యేవారు 8న స్లాట్ బుకింగ్ చేసుకోవాలి

- వికలాంగుల కోఆర్డినేటర్

నవతెలంగాణ-జక్రాన్‌పల్లి

సదరం క్యాంపుకు హాజరయ్యే వారు ఈనెల 8న మీ సేవలో స్లాట్ బుకింగ్ చేసుకోవాలని ఐకెపి వికలాంగుల సిసి శ్రీరామ్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 13, 20, 27 తేదీల్లో నిజామాబాద్ పట్టణంలోని ప్రభుత్వ జనరల్ ఆస్పత్రి లో సదరం క్యాంపులు నిర్వహిస్తారని పేర్కొన్నారు. సదరం క్యాంపునకు హాజరయ్యేందుకు స్లాట్ బుకింగ్ చేసుకోవాల్సి ఉంటుందని తెలిపారు. ఈ నెలలో మూడు సదరం క్యాంపులు నిర్వహించడంలో ఐదు రకాల వికలాంగత్వం 390 స్లాట్ బుకింగ్ చేసుకునే అవకాశం ఉందని పేర్కొన్నారు. సదరం క్యాంపునకు హాజరయ్యేవారు మెడికల్ రిపోర్టు, ఎక్స్‌రేలు తీసుకొని హాజరు కావాలని తెలిపారు. ఒక వ్యక్తితో ఒకరు హాజరుకావాలని సూచించారు. సదరం సర్టిఫికెట్ రెన్యువల్ చేసుకునేవారు పాత సదరం సర్టిఫికెట్తో హాజరు కావాలని పేర్కొన్నారు. సదరం సర్టిఫికెట్ గడువు ముగిసిన వారు వెంటనే సదరం సర్టిఫికేట్ రెన్యువల్ చేసుకోవాలని తెలిపారు. రెన్యువల్ చేసుకోకపోతే వికలాంగుల పెన్షన్ నిలిపివేయడం జరుగుతుందని పేర్కొన్నారు.

గర్భిణులకు సామూహిక శ్రీమంతాలు

నవతెలంగాణ-భీంగల్

మండలంలోని సంతోష్ నగర్ తండాలో పోషక అభియాన్ లో భాగంగా ఐసిడిఎస్ సూపర్వైజర్ రమాదేవి ఆధ్వర్యంలో గర్భిణీలకు సామూహిక శ్రీమంతాలను చేపట్టారు. ఈ సందర్భంగా గర్భిణీ స్త్రీలు తీసుకోవాల్సిన పోషకాహారం పై సూపర్వైజర్ అవగాహన కల్పించారు. అంగన్వాడి సెంటర్ల ద్వారా అందిస్తున్న పోషకాహారాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆమె తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ ఎంజి నాయక్ పంచాయతీ కార్యదర్శి అనుష తండా మహిళలు పాల్గొన్నారు

ఏఎన్ఎంల సమస్యలు పరిష్కరించాలి

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

ఏఐటియుసి ఆధ్వర్యంలో ఏఎన్ఎంల సమస్యలపై డీఎంఅండ్‌హెచ్ఓకు సుదర్శన్‌కు బుధవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి వై. ఓమయ్య మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం ఏఎన్ఎంల సమస్యలపై వేసిన 3మెన్ కమిటీ త్వరితగతిన ఏఎన్ఎంల రెగ్యులరైజేషన్, నోటిఫికేషన్ రద్దు లేదా 100శాతం గ్రాఫ్ శాలరీలతోపాటు ఇతర సమస్యలపై రాష్ట్ర ప్రభుత్వానికి నివేదిక సమర్పించి సమస్య పరిష్కారానికి కృషి చేయాలని తెలిపారు. సమ్మెను తాత్కాలికంగా వాయిదా వేయడం జరిగిందని విరమించలేదని అన్నారు. ప్రభుత్వం నియమించిన కమిటీ త్వరలో సమస్యలను పరిష్కరించని ఎడల మళ్లీ సమ్మెకు దిగుతామని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షురాలు ఈ భారతమ్మ రాష్ట్ర కమిటీ సభ్యులు మంజుల నాయకులు కళావతి, శశికళ ,రమ తదితరులు పాల్గొన్నారు.

ఎస్సీ కమిషన్ మాజీ సభ్యులు రాములును కలిసిన కొత్తకులాల ప్రతినిధులు


రాములుతో మాట్లాడుతున్న కొత్తకులాల ప్రతినిధులు

నవతెలంగాణ-నవీపేట్

జాతీయ ఎస్సీ కమిషన్ మాజీ సభ్యులు రాములుతో కొత్త కులాల ప్రతినిధులు న్యూఢిల్లీలో బుధవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఓడ్ కుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జాదవ్ శరత్ మాట్లాడుతూ.. అమాయకులపై అన్యాయంగా తప్పుడు ఎస్సీ, ఎస్టీ కేసులు నమోదవుతున్నాయని తెలిపారు. పోలీసులు, రెవెన్యూ యంత్రాంగం సైతం కనీస విచారణ జరుపకుండా కేసులు పెడుతున్న వైనంపై వాటి నివారణకు జాతీయ ఎస్సీ కమిషన్ ద్వారా చేపట్టే చర్యల గురించి చర్చించారు. ఇకపై అటువంటి తప్పుడు కేసులు నమోదు చేస్తే తన దృష్టికి తీసుకురావాలని తెలిపారు. కార్యక్రమంలో కులాల ప్రతినిధులు మోహన్ చ, గంగా ప్రసాద్ పాల్గొన్నారు.

చిటిమెల హరిప్రసాద్ ఆర్యవైశ్య జూనియర్ కళాశాల భూములపై విచారణ చేయాలి

నవతెలంగాణ మోపాల్

చిటిమెల హరిప్రసాద్ ఆర్యవైశ్య జూనియర్ కళాశాల ఏర్పాటు కోసం బోర్గం (పి) వద్ద ఉన్న 4 ఎకరాల 22 గుంటల భూములపై విచారణ జరిపించాలని పిడిఎస్‌యూ జిల్లా ప్రధాన కార్యదర్శి జన్నారపు రాజేశ్వర్ డిమాండ్ చేశారు.ఈ సందర్భంగా తహశీల్దార్‌కు బుధవారం వినతిపత్రం అందజేశారు. ఈసందర్భంగా రాజేశ్వర్ మాట్లాడుతూ చిటిమెల హరిప్రసాద్ ఆర్యవైశ్య జూనియర్ కళాశాల కోసం 4 ఎకరాల 22 గుంటలు ట్రస్ట్ ఆధ్వర్యంలో కొనుగోలు చేశారని,1994లో అప్పటి ముఖ్యమంత్రి శ్రీ.కోట్ల విజయ భాస్కర్ రెడ్డి శంకుస్థాపన చేసారని తెలిపారు. ఇప్పటి వరకు కళాశాల నిర్మించలేదని , కాలేజీ కోసం ఏర్పాటుచేసిన ట్రస్ట్ భూములు ఏమయ్యాయని, విద్యార్థుల కాలేజ్ ఏర్పాటుకు కోసం ఉన్న భూములను కొంత మంది వ్యక్తులు వారి పేరు మీద రిజిస్ట్రేషన్ చేసుకొని కబ్జా చేయటం సరైంది కాదని అన్నారు. విచారణ జరిపించి భూములను కాపాడాలని, భూములను కళాశాల నిర్మాణానికి వాడాలని అన్నారు. లేకుంటే ఆందోనా కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో పిడిఎస్‌యూ జిల్లా సహాయ కార్యదర్శి దేవిక, కోశాధికారి పవన్ జిల్లా నాయకులు సునీల్.నిఖిల్ తదితరులు పాల్గొన్నారు.

నేడే కాంగ్రెస్ భారీ ర్యాలీ

నవతెలంగాణ-డిచ్‌పల్లి

టీపీసీసీ అధ్యక్షులు రేవంత్ రెడ్డి ఆదేశాల మేరకు రాహుల్ గాంధీ చేపట్టిన హాత్ సే హాత్ జోడో కార్యక్రమం ఏడాది పూర్తి అయినా సందర్భంగా నిజామాబాద్ రూరల్ నియోజకవర్గంలో ప్రతి మండల పరిధిలో గురువారం ఉదయం 9 గంటలకు హాత్ సే హాత్ జోడో నినాదంతో ర్యాలీ నిర్వహించి, 10:30 మండల కేంద్రంలోని రైల్వేస్టేషన్ వద్ద భారీ ర్యాలీ నిర్వహించడం జరుగుతుందని కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, ప్రజా ప్రతినిధులు,ప్రజలు భారీ సంఖ్యలో పాల్గొని ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని మాజీ ఎమ్మెల్సీ, కాంగ్రెస్ పార్టీ నిజామాబాద్ రూరల్ నియోజకవర్గ ఇంచార్జీ డాక్టర్ భూపతి రెడ్డి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ముఖ్యఅతిథిలుగా డాక్టర్ ఆర్ భూపతిరెడ్డి మాజీ ఎమ్మెల్సీ, టిపిసిసి ప్రధాన కార్యదర్శి కాటిపల్లి నాగేష్ రెడ్డి,మాజీ ఎమ్మెల్సీ అరికెల నర్సారెడ్డి,జిల్లా కిషన్ కాంగ్రెస్ అధ్యక్షులు ముప్పగంగా రెడ్డి, టిపిసిసి ఉపాధ్యక్షులు తాహెర్ బిన్ హందన్,టి పిసిసి డెలిగేట్ శేఖర్ గౌడ్, తోపాటు జిల్లా స్థాయి నాయకులు పాల్గొంటారని తెలిపారు. నాయకులు కార్యకర్తలు అభిమానులు భారీగా తరలివచ్చి విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

నేషనల్ హెల్త్ మిషన్‌లో పనిచేస్తున్న ఉద్యోగులను రెగ్యులర్ చేయాలి

- సిఐటియు జిల్లా కార్యదర్శి నూర్జహాన్ డిమాండ్
- ధర్నాచౌక్‌లో రాస్తారోకో

నవతెలంగాణ-కంఠేశ్వర్



రాస్తారోకో చేస్తున్న ఉద్యోగులు

నేషనల్ హెల్త్ మిషన్‌లో పనిచేస్తున్న ఉద్యోగులను తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం వెంటనే రెగ్యులర్ చేయాలని సిఐటియు జిల్లా కార్యదర్శి నూర్జహాన్ డిమాండ్ చేశారు. బుధవారం నేషనల్ హెల్త్‌మిషన్‌లో పనిచేస్తున్న ఉద్యోగులు సిఐటియు ఆధ్వర్యంలో ధర్నా చౌక్ వద్ద రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా నూర్జహాన్, యూనియన్ జిల్లా అధ్యక్షులు షాదుల్లా మాట్లా డుతూ.. తెలంగాణ రాష్ట్రవ్యాప్తంగా ఇప్పటికే వలు శాఖల్లో ప్రభుత్వం రెగ్యులర్ చేసిందని, అన్ని శాఖల కన్నా ఎక్కువగా కష్టపడి ప్రాణాలకు తెగించి సేవలందిస్తున్న ఎన్‌హెచ్ఎం ఉద్యోగులను ప్రభుత్వం రెగ్యులర్ చేయలేదని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. కరోనా సమయంలో ప్రతి ఒక్కరు ఇంటికే పరిమితమైతే అన్ని రకాల వైద్య సేవలు అందించి ప్రజాప్రాణాలను కాపాడిన ఘనత నేషనల్ హెల్త్ మిషన్ ఉద్యోగులదని తెలిపారు. ప్రభుత్వం ఇప్పటికైనా ఆలోచించి ఉద్యోగులను రెగ్యులర్ చేయాలని కోరారు. కార్యక్రమంలో షాదుల్లా, మురళి, లక్ష్మణ్, గంగాధర్, రవి గౌడ్, వందన, మానస, ఝాన్సీ, శ్యామల, సోమశేఖర్, సత్యనారాయణ, శ్యామ్, సంధ్య, ఉసేన్ తదితరులు పాల్గొన్నారు.

వికలాంగుల సంక్షేమం, సాధికారత కోసం ప్రత్యేక పథకాన్ని ప్రవేశ పెట్టాలి

- సంక్షేమ పథకాల్లో ఐదుశాతం కేటాయించాలి
- ఆత్మ గౌరవం, హక్కుల సాధన కోసం ఉద్యమించాలి

నవతెలంగాణ-కంఠేశ్వర్



మాట్లాడుతున్న రమేష్‌బాబు

వికలాంగుల సంక్షేమం, సాధికారత కోసం ప్రత్యేక పథకాన్ని ప్రవేశపెట్టాలని, ఆత్మ గౌరవం హక్కుల సాధన కోసం ఉద్యమించాలని వికలాంగుల హక్కుల జాతీయ వేదిక జిల్లా అధ్యక్షులు పి. కవిత డిమాండ్ చేశారు. వికలాంగుల హక్కుల జాతీయ వేదిక నిజామాబాద్ జిల్లా ముఖ్య కార్యకర్తల సమావేశం బుధవారం నిజామాబాద్ సీఐటీయూ కార్యాలయంలో జిల్లా ఉపాధ్యక్షులు రాములు అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా ఎన్‌పిఆర్‌డి నిజామాబాద్ అధ్యక్షురాలు కవిత మాట్లాడుతూ.. వికలాంగులకు విద్య, ఉపాధి దక్కడం లేదని అన్నారు. వికలాంగులలో ఉన్న శక్తి సామర్థ్యాలను వెలికి తీయడానికి ప్రభుత్వాలు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. వికలాంగుల జనాభాకు అనుగుణంగా విద్యా సంస్థలు ఏర్పాటు చేయాలని అన్నారు. ఉన్నత విద్యను అభ్యసించి ఉపాధి లేక నిరుద్యోగులుగా ఉంటున్నారని. విద్యా ఉపాధి కల్పన కోసం ప్రత్యేక పాలసీనీ ప్రకటించాలని డిమాండ్ చేశారు. వికలాంగులు వైద్య పరమైన పునరావాస సేవలు, 8 శాతం మాత్రమే సహాయ పరికరాలు , 15 శాతం మంది ఆరోగ్య సేవలు, 10.5శాతం మంది సంక్షేమ సేవలు పొందుతున్నారని అన్నారు. 51 శాతం మంది పాఠశాలలకు వెళ్తే 5 శాతం మంది పిల్లలకు మాత్రమే ప్రత్యేక విద్య అందుతుందని తెలిపారు. 44.4 శాతం మంది వికలాంగులు ఏదో ఒక పని చేస్తుంటే 55.6శాతం మంది వికలాంగులు ఉపాధి లేక నిరుద్యోగులుగా ఉంటున్నారని అన్నారు. కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన యాక్సెస్సుబుల్ ఇండియా క్యాంపెయిన్ ద్వారా 2018 నాటికి ప్రధాన పట్టణాల్లో 50 శాతం కార్యాలయాలు వికలాంగులకు అందుబాటులోకి తేవడానికి 1182 స్థలాలను గుర్తిస్తే నేటికీ 482 మాత్రమే అందుబాటులోకి వచ్చాయనీ అన్నారు. మనసిక వికలాంగుల సంరక్షణ కోసం ప్రవేశ పెట్టిన మెంటల్ హెల్త్ కేర్ యాక్టు ను పటిష్ఠంగా అమలు చేయాలని డిమాండ్ చేశారు. తీవ్ర వైకల్యం కలిగిన వికలాంగుల సహాయకులకు ప్రత్యేక అలవెన్స్ ఇవ్వాలనే 2016 ఆర్పీడీ చట్టం సెక్షన్ 24ను ఎందుకు అమలు చేయడం లేదని ప్రశ్నించారు. సంక్షేమ పథకాలలో 25శాతం అదనంగా ఇవ్వాలని, చట్టంలో ఉందని దాన్ని వెంటనే అమలు చేసి ప్రభుత్వ పథకాలకు వర్తింప చేయాలని కోరారు. 40శాతం వైకల్యం కలిగిన వికలాంగులకు యూనిక్ డిసెబుల్డ్ గుర్తింపు కార్డ్ మంజూరు చేయాలని అన్నారు. 2013 ఆహార భద్రత చట్టం ప్రకారం.. వికలాంగులకు అంత్యోదయ కార్డులు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ రంగ సంస్థలు ప్రైవేట్ పరం చేయడం వల్ల వికలాంగులు రిజర్వేన్స్ కోల్పోయే ప్రమాదం ఏర్పడుతుందని అన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ శాఖల్లో ఖాళీగా ఉన్న పోస్టులను భర్తీ చేయడానికి ప్రత్యేక నోటిఫికేషన్ విడుదల చేయాలనీ డిమాండ్ చేశారు. నామినేటెడ్ పదవులలో రిజర్వేషన్స్ అమలు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జిల్లా నాయకులు సాయిలు, రాములు, నజీర్, బాయ్, గోపాల్ గౌడ్,సుగుణ, సంగీత,గంగాధర్,హరిప్రియ, చింటూ, సాయినాథ్, ఈ యొక్క కార్యక్రమానికి తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ సమ్మె పోస్టర్లు ఆవిష్కరణ

నవతెలంగాణ-కంఠేశ్వర్



సమ్మె పోస్టర్లు ఆవిష్కరిస్తున్న నాయకులు, అంగన్‌వాడీ టీచర్లు

సెప్టెంబర్ 11 నుండి అంగన్వాడీ ఉద్యోగులకు కనీస వేతనం 26వేలు అమలుకు నిరవధిక సమ్మెను జయప్రదం చేయాలని సిఐటియు జిల్లా కార్యదర్శి నూర్జహాన్ డిమాండ్ చేశారు. బుధవారం సిఐటియు కార్యాలయంలో అంగన్వాడి ఉద్యోగుల సమ్మె పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా కార్యదర్శి నూర్జహాన్ మాట్లాడుతూ.. సెప్టెంబర్ 11 వరకు అంగన్వాడి ఉద్యోగులను పర్మినెంట్ చేయాలని, ఆలోపు కనీస వేతనం 26వేలు నిర్ణయించి అమలు చేయాలని ఆమె ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. 48 సంవత్సరాలుగా రక్తహీనతతో పౌష్టికాహారం లేక బాధపడుతున్న మహిళలకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సంక్షేమ పథకాలను అందే విధంగా కృషిచేస్తున్న అంగన్వాడీ ఉద్యోగుల పట్ల కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిర్లక్ష్య ధోరణితో అతి తక్కువ వేతనాలు ఇస్తూ వెట్టిచాకిరి చేయించుకుంటున్నాయని ఆరోపించారు. అంగన్వాడి ఉద్యోగులను వెంటనే పర్మినెంట్ చేయాలని, ఆలోపు కనీస వేతనం 26వేలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం గ్రాడ్యుటీ చెల్లించాలని, రిటైర్మెంట్ బెనిఫిట్‌గా టీచర్ కు 10 లక్షలు ఆయాకు 5 లక్షలు ఇవ్వాలని, వేతనంలో సగం పెన్షన్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. మూడు నెలలుగా వివిధ రూపాలలో ఆందోళనలు నిర్వహించడం జరిగిందని, మూడు రోజుల టోకెన్ సమ్మె, రాష్ట్రవ్యాప్తంగా జీపు జాత, సిడిపిఓ, కలెక్టరేట్ల ముందు మహాధర్నాలు నిర్వహించి 21 డిమాండ్లతో కూడిన సమ్మె నోటీసులు మంత్రి సత్యవతి రాథోడ్ కు, రాష్ట్ర కమిషనర్ కు, జిల్లా కలెక్టర్, జిల్లా సంక్షేమ అధికారికి ఇవ్వడం జరిగిందని తెలిపారు. సెప్టెంబర్ 10 నాటికి సమస్యలు పరిష్కరించని ఎడల 11 నుండి సమస్యలు పరిష్కారం అయ్యేంతవరకు నిరవధిక సమ్మె చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు మల్యాల గోవర్దన్, అంగన్వాడి యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి స్వర్ణ, వాణి, శ్రీదేవి సునీత జయ సుమలత, గిరిజ, భూమవ్వ, అనసూయ, పద్మ అంజలి, తదితరులు పాల్గొన్నారు.

అర్బన్ అభ్యర్థిగా దరఖాస్తు చేసుకున్న ధన్‌పాల్

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ


దరఖాస్తు చేసుకుంటున్న ధన్‌పాల్ సూర్యనారాయణ

నిజామాబాద్ అర్బన్ బీజేపీ అభ్యర్థిగా దరఖాస్తు చేసుకున్న ధన్‌పాల్ బుధవారం నిజామాబాద్ నగరం నుంచి పెద్ద ఎత్తున బిజెపి కార్యకర్తలు, కార్పొరేటర్లు, మండల అధ్యక్షులు సీనియర్ నాయకులు పెద్ద ఎత్తున బిజెపి రాష్ట్ర కార్యాలయానికి భారీ కాన్వాయ్‌తో బయలుదేరి వెళ్లారు. నిజామాబాద్ అసెంబ్లీ నియోజకవర్గానికి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ధన్‌పాల్ సూర్యనారాయణ దరఖాస్తు చేసుకున్నారు 30 సంవత్సరాలుగా విశ్వహిందూ పరిషత్‌లో పనిచేసే 2014లో రాజకీయ రంగ ప్రవేశం చేసిన ధన్‌పాల్ ఆయన చేసిన సేవా కార్యక్రమాలను పొందుపరిచినట్లు సమాచారం. ధన్‌పాల్ సేవా కార్యక్రమాలను రాష్ట్రవ్యాప్తంగా ప్రజలంతా ఎప్పటికప్పుడు సోషల్ మీడియా వేదికగా చూస్తూనే ఉంటారు. రాష్ట్ర కార్యాలయంలో రాష్ట్ర అధ్యక్షులు కిషన్ రెడ్డి సూచన మేరకు ధన్‌పాల్ మీడియా ముందు మాట్లాడకుండానే దరఖాస్తు చేసుకొని కార్యకర్తలతో తిరుగు ప్రయాణం అయ్యారు. కార్యక్రమంలో మున్సిపల్ ఫ్లోర్ లీడర్ గోపిడి స్రవంతి వినోద్ రెడ్డి, జిల్లా ఉపాధ్యక్షులు నాగొల్ల లక్ష్మీనారాయణ, అసెంబ్లీ కన్వీనర్ పంచ రెడ్డి లింగం, కార్పొరేటర్లు సుక్క మధు, మాస్టర్ శంకర్, బంటు రాము, మీసేవ శ్రీనివాస్ పంచ రెడ్డి ప్రవళిక, శ్రీధర్ బూరుగుల ఇందిరా వినోద్, ఇల్లందుల ప్రభాకర్ మోర్చా అధ్యక్షులు శివ ప్రసాద్, కైసర్, సర్పంచ్ గంగన్న దొంతుల రవి కుమార్, నాయకులు పాల్గొన్నారు.

పద్మశాలి సంఘ భవన నిర్మాణానికి భూమిపూజ


భూమిపూజ చేస్తున్న సంఘ సభ్యులు

నవతెలంగాణ-కమ్మర్‌పల్లి

మండలంలోని ఉప్లూర్ ఓంశ్రీ మొదటి పద్మశాలి సంఘం కమ్యూనిటీ భవన నిర్మాణానికి బుధవారం భూమిపూజ కార్యక్రమాన్ని నిర్వహించారు. రాష్ట్ర రోడ్లు భవనాలు, గృహ నిర్మాణ, శాసనసభ వ్యవహారాల శాఖ మంత్రి వేముల ప్రశాంత్ రెడ్డి సంఘ భవనం నిర్మాణానికి రూ. 5లక్షలు మంజూరు చేశారు. ఆ నిధులతో చేపడుతున్న సంఘ భవన నిర్మాణానికి సంఘ సభ్యుల సమక్షంలో మార్కండేయ పూజా కార్యక్రమాలు నిర్వహించి భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా సంఘ భవన నిర్మాణానికి నిధులు అందించి సహకరించిన మంత్రి ప్రశాంత్ రెడ్డికి ఓంశ్రీ మొదటి పద్మశాలి సంఘం సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ బద్దం పద్మ చిన్నారెడ్డి, బీఆర్ఎస్ మండల అధ్యక్షులు, కమ్మర్ పల్లి ప్రాథమిక సహకార సంఘం అధ్యక్షులు రేగుంట దేవేందర్, గ్రామ బిఆర్ఎస్ అధ్యక్షులు అవారి మురళి, ఎంపీటీసీ సభ్యుడు పిప్పర అనిల్, ఉప సర్పంచ్ నందగిరి రేఖ శ్రీధర్, సంఘం అధ్యక్షులు అలిశెట్టి అరవింద్, ఉపాధ్యక్షులు జిందం శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి ఎనుగందుల శశిధర్, కోశాధికారి నాగుల ప్రసాద్, సంఘు సభ్యులు పాల్గొన్నారు.

నిజామాబాద్ నూతన సిపికి మంత్రి వేముల శుభాకాంక్షలు

నవతెలంగాణ-కంఠేశ్వర్

నిజామాబాద్ జిల్లా పోలీస్ కమిషనర్‌గా ఇటీవల నియమితులైన సత్యనారాయణ బుధవారం రాష్ట్ర రోడ్లు భవనాలు శాఖ మంత్రి వేముల ప్రశాంత్ రెడ్డి ని మినిస్టర్ క్వార్టర్స్‌లో మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా నూతన సిపి సత్యనారాయణకు మంత్రి హృదయ పూర్వక శుభాకాంక్షలు తెలియజేశారు.


మంత్రికి బొకేను అందజేస్తున్న సీపీ

జీజీహెచ్‌లో బాలింతలకు ప్రత్యేక వార్డు ఏర్పాటు

నవతెలంగాణ-కంఠేశ్వర్

ప్రభుత్వ జనరల్ ఆస్పత్రి నిజామాబాద్‌లో రోజురోజుకి ప్రసవాల సంఖ్య పెరుగుతుండడం వలన బాలింతలకు ఎటువంటి ఇబ్బంది కలగకుండా ఉండేందుకు ఇదివరకు ఉన్న వార్డులతో పాటు మరొక ప్రత్యేకమైన పోస్ట్ నాటల్ వార్డును బుధవారం రెండవ అంతస్తు లో సూపరింటెండెంట్ డాక్టర్ ప్రతిమరాజ్ ప్రారంభించడం జరిగింది. కార్యక్రమంలో ఆసుత్రి వైద్య బృందం, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ప్రెసిడెన్సి పాఠశాలలో దంత వైద్య శిబిరం


పంటి పరీక్షలు చేస్తున్న వైద్యులు

నవతెలంగాణ మోపాల్

మండల శివారులో గల ప్రెసిడెన్సీ ఉన్నత పాఠశాలలో బుధవారం శీను నాయక్ దంత వైద్యశాల ఆధ్వర్యంలో ఉచితంగా ఆరు నుండి పదవ తరగతి చదువుతున్న విద్యార్థులకు, ఉపాధ్యాయులకు వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. విద్యార్థుల సమస్యలను తెలుసుకొని వారి కనుగుణంగా వైద్యం అందించి ఉచితంగా మందులు అందజేశారు. డాక్టర్ శీను నాయక్ మాట్లాడుతూ దంత సంరక్షణ గురించి విద్యార్థులు తీసుకోవాల్సిన జాగ్రత్తలను ఆయన వివరించారు. దంత క్షయం అనేది దీర్ఘకాలిక వ్యాధి అని ఒకసారి వ్యాధి వస్తే జీవితాంతం కొనసాగుతుందని అన్నారు. దీనికి త్వరగా చికిత్స అవసరమని తెలిపారు. దంత సమస్య అని తేలికగా తీసుకోవద్దని అది కొద్ది కొద్దిగా పెరిగి పెద్దది అవుతుందని అన్నారు. ఆదిలోనే చికిత్స చేసుకొని దానిని కట్టడి చేయాలని ఆయన తెలిపారు. పాఠశాలల పిల్లల కోసం శ్రద్ధ తీసుకుంటున్న కళాశాల చైర్మన్ శ్రీమంత రెడ్డి, ఉపాధ్యాయులను ఆయన అభినందించారు. కార్యక్రమంలో పవన్ కుమార్ డి మహేష్ మరియు దంత వైద్యులు డాక్టర్ సంజయ్, డాక్టర్ మౌనిక, మేనేజర్ మహేష్ తదితరులు పాల్గొన్నారు.

మా మద్దతు ప్రశాంత్ రెడ్డికే

- మద్దతుగా 51కుటుంబాల తీర్మానం

నవతెలంగాణ-ముప్కాల్

మండలంలోని నల్లూరు గ్రామానికి చెందిన (మాదిగ సంఘం) 51 కుటుంబాలు బీఆర్ఎస్ పార్టీకి కట్టుబడి ఉంటామని,తిరిగి బాల్కొండ ఎమ్మెల్యేగా మళ్ళీ వేముల ప్రశాంత్ రెడ్డిని గెలుపించుకుంటామని ఏకగ్రీవంగా తీర్మానం చేశారు. తీర్మానం కాపీని బుధవారం బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు ఎంపీపీ భర్త సామ వెంకట్ రెడ్డికి అందజేశారు. తెలంగాణ రాష్ట్రంలో సీఎం కేసీఆర్ చేస్తున్న అభివృద్ధి, మరోవైపు మంత్రి వేముల ప్రశాంత్ రెడ్డి బాల్కొండ నియోజకవర్గంలో చేస్తున్న అభివృద్ధి పనులకు ఆకర్షితులమై తీర్మానం చేశామన్నారు. కార్యక్రమంలో నల్లూరు ఎంపీటీసీ సభ్యులు సత్యనారాయణ, బీఆర్ఎస్ పార్టీ నాయకులు, మాదిగ సంఘం పెద్దలు పాల్గొన్నారు..

24గంటలలో రైల్వే గేటును తెరిపించండి

- లేకపోతే ఎమ్మెల్యే బిగాల, ఎంపీ అరవింద్ రాజీనామా చెయ్యండి

నవతెలంగాణ-కంఠేశ్వర్

నిజామాబాద్ అర్బన్ పరిధిలోని లలితా మాల్ థియేటర్ సమీపంలో గల రైల్వే గేటును వెంటనే తెరిపించాలని, లేకపోతే ఎమ్మెల్యే బిగాల బిగాల గణేష్‌గుప్త, ఎంపీ అరవింద్ రాజీనామా చేయాలని కాంగ్రెస్ నాయకులు, మాజీ మేయర్ ధర్మపురి సంజయ్ అన్నారు.

రైల్వేగేటు మూసేయడంతో కూలీలకు, చిన్న చిన్న వ్యాపారస్తులకు, తోపుడు బండి వ్యాపారస్తులకు ప్రజలందరూ ఉపయోగించే సులువైన మార్గాన్ని మూసేసి ప్రజలను ఇబ్బంది పెడుతున్న ప్రభుత్వాలపై ధర్నాకు దిగిన వారికి బుధవారం మద్దతు తెలిపారు. నిజామాబాద్ బీ.ఆర్.ఎస్ ఎమ్మెల్యే, బీజేపీ ఎంపీ ఇద్దరు 24గంటలలో రైల్వే గేటును తెరిపించకపోతే రాజనామా చెయ్యాలన్నారు. లేదా ప్రజలే రోడ్లెక్కి తరిమికొడతారు అని హెచ్చరించారు. పేదవారి సమస్యలు తీర్చలేని ప్రజాప్రతినిధులు పదవులలో ఉండటం వృధా అని అన్నారు.

పార్టీ కోసం పనిచేయాలి


నూతన బూత్‌స్థాయి కమిటీ

నవతెలంగాణ-సందిపేట్

ఎమ్మెల్యే జీవన్ రెడ్డి గెలుపుకోసం ప్రతి కార్యకర్త కృషి చేయాలని గాదెపల్లి సర్పంచ్ నక్కల భూమేష్, బీఆర్ఎస్ పార్టీ సోషల్ మీడియా ఇంచార్జి గడ్డం చిన్నా రెడ్డి అన్నారు. బుధవారం వీరి ఆధ్వర్యంలో బూత్ స్థాయి కమిటీలను ఏర్పాటు చేశారు. ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో పార్టీ గెలుపు కోసం గ్రామాల్లో పర్యటిస్తూ వ్యూహ రచనలు చేశామని వారు తెలిపారు. బూత్ స్థాయి కమిటి సభ్యులకు పార్టీ గొడుగులను పంపిణీ చేశామన్నారు.

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
నిజామాబాద్-కామారెడ్డి
గురువారం | సెప్టెంబర్ 07, 2023 | www.navatelangana.com

విజయ్ హైస్కూల్లో ఘనంగా ఉపాధ్యాయ దినోత్సవం

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతిని పురస్కరించుకుని జరిగిన ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా విజయ్ హైస్కూల్ ఉపాధ్యాయులు బుధవారం సాంస్కృతిక కార్యక్రమంలో భాగంగా 'శ్రీ కృష్ణ తులాభారం' రూపకాన్ని 80 మంది టీచర్స్ ప్రదర్శించారు. కార్యక్రమంలో పాల్గొన్న ఉపాధ్యాయబృందాన్ని విజయ్ హైస్కూల్ వ్యవస్థాపక సభ్యులు డా.అమృతలత, సిహెచ్. లలితాదేవి, ఏ. తారాచౌదరి, కె. విజయలక్ష్మి, నెల్లుట్ల రమాదేవి అభినందించారు.


శ్రీకృష్ణ తులాభారం ప్రదర్శన

ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులు పంపిణీ

నవతెలంగాణ-మోపాల్

మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ లతా కన్నిరామ్, జెడ్పిటిసి కమల నరేష్ ఆధ్వర్యంలో మండలంలోని 12 మంది లబ్దిదారులకు రెండు లక్షల 2,47,500 విలువగల ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులను పంపిణీ చేశారు., ఈ సందర్భంగా ఎంపీపీ, జడ్పిటిసి మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాతనే ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులను పార్టీలకు అతీతంగా బాజిరెడ్డి గోవర్ధన్ సహకారంతో అందజేయడం జరుగుతుందని తలెఇపారు. కార్యక్రమంలో బాడ్సి సొసైటీ చైర్మన్ నిమ్మల మోహన్ రెడ్డి, మోపాల్ ఎంపిటిసి ముత్తన్న, సర్పంచులు సాయి రెడ్డి, ప్రకాష్, సిద్దార్థ, భరత్, తదితర టీఆర్ఎస్ కార్యకర్తలు పాల్గొన్నారు.


చెక్కులు పంపిణీ చేస్తున్న దృశ్యం

తాళాలు వేసిన ఇండ్లే టార్గెట్

- వరుస చోరీలు
- బెంబేలెత్తుతున్న ప్రజలు

నవతెలంగాణ-ఆర్మూర్

పట్టణంతో పాటు చుట్టుపక్కల గ్రామాలలో దోపిడీ దొంగలు రెచ్చిపోతున్నారు. తాళాలు వేసిన ఇండ్లనే టార్గెట్ గా చేసుకొని పట్టపగలు సైతం చోరీలకు పాల్పడుతున్నారు. గత కొన్ని నెలల క్రింద పట్టణంలోని బంగారు ఆభరణాలు తయారు చేసే వ్యక్తి కుటుంబ సభ్యులు తాళాలు వేసి గ్రామాలకు వెళ్లారు. వారి ఇంట్లో దొంగలుపడి 40 తులాల బంగారం ఎత్తుకెళ్లారు. పెర్కిట్ అన్నపూర్ణ కాలనీలో తాళం వేసిన ఇంట్లో దొంగలు బీభత్సం సష్టించి 25వేలు ఎత్తుకెళ్లారు. పట్టణంతో పాటు డివిజన్లోని బాల్కొండ, కమ్మరపల్లి, భీంగల్ మండలాల్లోని జరిగిన చోరీలు పోలీసులకు సవాలుగా మారాయి. నగదు అపహరణ, ఇళ్లల్లోకి చొరబడడం, బస్టాండ్లో రహదారులపై జరుగుతున్న ఈ చోరీలు పోలీసులకు సవాల్‌గా మారుతున్నాయి.. నిందితులను పట్టుకునేందుకు పోలీసులకు వెళుతున్న దోపిడీ దొంగలు వేరే ప్రాంతాలకు వెళ్లి దోచేస్తున్నారు..



గత కొద్ది నెలల క్రిందట....

గత జూన్ నెలలో ఆర్మూర్ బస్టాండ్ వద్ద ఇద్దరు మహిళల నుండి గంట వ్యవధిలోనే నాలుగు తులాల బంగారం, నగదు, సెల్ ఫోను కొట్టేశారు. పట్టణంలో ఒకే రాత్రి మూడు చోట్ల ముగ్గురు మహిళల మెడలో నుంచి నాలుగు తులాల బంగారు గొలుసులు లాక్కెళ్ళిన సంఘటనతో పట్టణవాసులు ఉలిక్కిపడ్డారు. రాత్రి 11 గంటల సమయంలోనే వైన్సు నిర్వాహకుల నుండి 2లక్షల 76 వేలు అపహరించారు. కమ్మరపల్లి మండలంలోని హసకొత్తూరు గ్రామంలో ఎనిమిదిన్నర తులాల బంగారు, 30 తులాల వెండి, నగదు ఎత్తుకెళ్లారు. భీంగల్ పట్టణంలోని బాపూజీ నగర్ లో ఇదే తరహాలో మూడు లక్షల నగదు, మూడు తులాల బంగారం అపహరిచారు. మున్సిపల్ పరిధిలోని పెర్కిట్ శ్రీరామ కాలనీలో తాళం వేసిన ఇంట్లో దొంగలు చోరీకి పాల్పడి 15 తులాల బంగారం, రూ.50 వేలు నగదు, బైక్ ఎత్తుకెళ్లిన సంఘటన గత నెల 12న జరిగింది. దౌల్తాపూర్ విఠల్ కుటుంబీకులు ఇంటికి తాళం వేసి బంధువుల ఇంటికి బాన్సువాడ వెళ్ళారు. ఆదివారం ఉదయం ఇంటి ఓనర్ నారాగౌడ్ బంగ్లా పైకి వెళ్ళి చూడగా తాళం పగులగొట్టి ఉంది. ఈవిషయం తెలియగానే బాన్సువాడ నుండి విఠల్ తిరిగి వచ్చారు. ఇంట్లో చూసేసరికి బీరువా ఉన్న 15 తులాల బంగారంతో పాటు బైకును సైతం ఎత్తుకెళ్లారు. దొంగలు ఇటీవల మున్సిపల్ పరిధిలోని కుక్కల గుట్ట శ్రీనివాస్ నగర్ లో తాళం వేసిన ఇంట్లో దొంగలు చొరబడి బీభత్సం సష్టించారు

నిఘా పెంచి ప్రత్యేక బందాలను ఏర్పాటు చేశాం..

చోరీలను నియంత్రించేందుకు నిఘ పెంచాం.. రాత్రి సమయాల్లో ఎక్కువమంది విధులు నిర్వహించేలా చర్యలు తీసుకుంటున్నాం. సీసీ కెమెరాల యొక్క ఆవశ్యకతపై ప్రజలకు అవగాహన కల్పిస్తున్నాం..



సురేష్ బాబు,, స్టేషన్ హౌస్ ఆఫీసర్, ఆర్మూర్..

క్రిస్టియన్ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్‌కు సన్మానం


రాజేశ్వర్‌ను సన్మానిస్తున్న పాస్టర్స్

నవతెలంగాణ-డిచ్‌పల్లి

తెలంగాణ క్రిస్టియన్ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ డి.రాజేశ్వర్‌రావును బుధవారం డిచ్ పల్లి మండల కేంద్రంలో రూరల్ పాస్టర్స్ అసోసియేషన్ సభ్యులు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ప్రెసిడెంట్ గడ్డం ఆమోస్ మాట్లాడుతూ రాష్ట్రంలోని పేద క్రైస్తవుల ప్రత్యేక ఫైనాన్స్ కార్పొరేషన్ ఏర్పాటు చేసి చైర్మన్ గా డి.రాజేశ్వరరావును నియమించి నందుకు సిఎం కేసీఆర్, మంత్రి ప్రశాంత్ రెడ్డి, ఆర్టీసీ చైర్మన్ నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్ లకు కృతజ్ఞతలు తెలిపారు. సన్మానించిన వారిలో అధ్యక్షులు గడ్డం ఆమోస్,సెక్రటరీ వాసా రాబర్ట్, సలహాదారులు ఎస్.మోహన్, ఎం. బాలస్వామి, జిల్లా క్రైస్తవ మత పెద్దలు ఉన్నారు.

మైనార్టీ గురుకులంలో ఖాళీ పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

నవతెలంగాణ-డిచ్‌పల్లి

తెలంగాణ మైనార్టీ గురుకుల పాఠశాల, జూనియర్ కళాశాల బాలుర నిజామాబాద్‌లో జెఎల్ ఇంగ్లీష్, టీజీటీ సోషల్, స్టాఫ్ నర్స్ పోస్టులకు తగిన అర్హతలు కలిగిన అభ్యర్థుల నుండి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ శ్వేత బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి గల అభ్యర్థులు తగిన ధ్రువపత్రాలతో పాఠశాల పని దినాల్లో సంప్రదించాలని సూచించారు. ఇతర సందేహాల కోసం ఫోన్ నెంబర్ 94917444748 ను సంప్రదించాలని తెలిపారు.

మైనారిటీ బాలికల కళాశాలలో దరఖాస్తుల ఆహ్వానం

నవతెలంగాణ-బాల్కొండ

మండల కేంద్రంలోనీ మైనారిటీ గురుకుల బాలికల కళాశాలలో బోధించుటకు బోధన సిబ్బంది దరఖాస్తు చేసుకోవాలని కళాశాల ప్రిన్సిపాల్ వాణి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. కళాశాలలో మ్యాథ్స్ టీజీటి, ఇంగ్లీష్ పిజిటి సబ్జెక్టుల్లో బోధించుటకు అనుభవజ్ఞులై, రెండు సంవత్సరాలు ఏదైనా జూనియర్ కళాశాలలో విద్యాబోధన చేసిన అనుభవం కలిగి ఉండాలని పేర్కొన్నారు. అర్హత కలిగిన అభ్యర్థులు తమ బయోడేటా, సర్టిఫికెట్లతో సంప్రదించాలని కోరారు. ఈ అవకాశం కేవలం మహిళ అభ్యర్థులకు మాత్రమేనని, దరఖాస్తులకు చివరి తేదీ ఈనెల 9 అని తెలిపారు.

సోయాబీన్ పంటల పరిశీలన


పంటను పరిశీలిస్తున్న వ్యవసాయాధికారి

నవతెలంగాణ-ముప్కాల్

మండలంలోని వేంపల్లి, నాగంపేట్ గ్రామాల్లో సోయాబీన్ పంటలను మండల వ్యవసాయాధికారి రాజ్‌కుమార్ పరిశీలించారు. గత ఆగస్టు నెలలో నెలకొన్న వర్షాభావ, ఉక్కపోత వాతావరణంవల్ల పలు చీడ పీడలు ఆశిస్తున్నట్లు తెలిపారు. ముఖ్యంగా సోయా పంటలో పల్లాకు తెగులు, కాండం కుళ్ళు తెగులు ఆశించడంతో దిగుబడి తగ్గే అవకాశం ఉందన్నారు. తొలి దశలోనే కాండం ఈగ నివారణకు 4జీ గుళికలు వాడాలని అన్నారు. కాండం కుళ్ళు, తెగులు నివారణకు ట్రైఫాక్సి స్ట్రోబిన్ లేదా టేబుకొనజల్ 0.4 గ్రాము లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలన్నారు. పల్లాకు తెగులు తెల్ల దోమ ద్వారా వ్యాప్తి చెందడంతో మొక్క ఆకులు పసుపు రంగులోకి మారుతాయని అన్నారు. ఇలాంటి సూచనలు ఉన్నట్లయితే ఎసెటమిప్రిడ్ 1.25 ఎంఎల్‌తోపాటు నీమ్ ఆయిల్ 5ఎంఎల్ లీటరు నీటిలో కలిపి పిచికారీ చేసుకోవచ్చన్నారు. అయితే ప్రస్తుతం కురుస్తున్న వర్షాల వల్ల రసం పీల్చు పురుగుల ఉధృతి తగ్గుతుందని, కావున అధిక మొక్కల సాంద్రత ఉన్న సోయా పంటలలో మాత్రమే పిచికారీ అవసరమన్నారు. కాండం ఈగ నివారణకు క్లోరాంట్రాని లిప్రోల్‌లామ్డా సైహలోత్రిన్ 0.4 ఎలెల్ మందును లీటరు నీటిలో కలుపుకొని పిచికారి చేసి పంటను కాపాడుకోవాలని అన్నారు. కార్యక్రమంలో ఏఈవో నిషికాంత్, రైతులు వెంకటనర్సయ్య, నరేష్, నర్సయ్య పాల్గొన్నారు..

యువకుడి వేధింపులకు బీటెక్ విద్యార్థిని ఆత్మహత్య

- నగరంలో కలకలం రేపిన ఘటన
- దర్యాప్తు చేపట్టిన పోలీసులు

నవతెలంగాణ-కంఠేశ్వర్

ఓ యువకుడి వేధింపులు భరించలేక ఉరివేసుకొని బీటెక్ విద్యార్థిని ఆత్మహత్యకు పాల్పడ్డ ఘటన నిజామాబాద్ జిల్లా కేంద్రంలో బుధవారం చేసుకుంది. రెండవ టౌన్ ఎస్ఐ అశోక్ తెలిపిన వివరాల ప్రకారం... నగరంలోని గోల్ హనుమాన్ ప్రాంతానికి చెందిన పూనం తివారి తన భర్త మృతి చెందడంతో ఇద్దరు కూతుర్లు, కొడుకుతో కలిసి జీవిస్తుంది. పూనం తివారి ఓ ప్రైవేటు పాఠశాలలో టీచర్‌గా పని చేస్తుంది. అయితే చిన్న కూతురు స్నేహ తివారి (18) ఆర్మూర్ లోని క్షత్రియ కాలేజీలో బీటెక్ మొదటి సంవత్సరం చదువుతోంది. సదరు యువతికి ప్రేమ పేరుతో సోఫియాన్ అనే యువకుడు తరచూ ఫోన్ చేస్తూ వేధించేవాడు. విషయం తెలుసుకున్న స్నేహతివారి తల్లి పూనం తివారి సోఫియాన్‌ను మందలించింది. రోజు మాదిరిగా స్నేహ తల్లి పూనం స్కూల్‌కి వెళ్ళింది. ఇంట్లో ఎవరూ లేకపోవడంతో సదరు యువతి ఇంట్లో సీలింగ్ ఫ్యాన్ కు ఉరివేసుకొని బలవన్మరణానికి పాల్పడింది. కుటుంబ సభ్యులు రెండవ టౌన్ పోలీసులకు సమాచారం అందించగా, ఘటన స్థలానికి చేరుకొని మృతదేహాన్ని పంచనామా నిమిత్తం మార్చురీకి తరలించారు. సోఫియాన్ వేధింపుల వల్లే తన కూతురు ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడిందని తల్లి ఫిర్యాదు మేరా కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టామని ఎస్సై అశోక్ తెలిపారు.

ఉత్తమ ఉపాధ్యాయులకు ఘనంగా సన్మానం

నవతెలంగాణ-కమ్మర్‌పల్లి/నిజామాబాద్ రూరల్/ఆర్మూర్

మండలకేంద్రంలోని బాలికల ప్రాథమిక పాఠశాలలో సెకండరీ గ్రేడ్ ఉపాధ్యాయురాలిగా పనిచేస్తున్న చిలుక జ్యోతి జిల్లా స్థాయి ఉత్తమ ఉపాధ్యాయురాలుగా సన్మానం పొందినట్టు మండల విద్యాధికారి ఆంధ్రయ్య బుధవారం తెలిపారు. ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా జిల్లా కేంద్రంలో నిర్వహించిన ఉపాధ్యాయ దినోత్సవ కార్యక్రమంలో రాష్ట్ర రోడ్లు భవనాలు, గృహ నిర్మాణ, శాసనసభ వ్యవహారాల శాఖ మంత్రి వేముల ప్రశాంత్ రెడ్డి, జిల్లా కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు, జిల్లా పరిషత్ చైర్మన్ దాదన్న గారి విట్టల్ రావు, జిల్లా విద్యాధికారి దుర్గాప్రసాద్ చేతుల మీదుగా జిల్లా ఉత్తమ ఉపాధ్యాయురాలిగా ఎంపికైన జ్యోతిని సన్మానించి, ప్రశంస పత్రాన్ని అందించినట్లు ఎంఈఓ తెలిపారు. జిల్లా స్థాయి ఉత్తమ ఉపాధ్యాయురాలిగా సన్మానం పొందిన చిలుక జ్యోతికి పాఠశాల ప్రధానోపాధ్యాయులు జి. రవీందర్, ఉపాధ్యాయులు రవికుమార్, తదితరులు శుభాకాంక్షలు తెలిపారు.

నిజామాబాద్ రూరల్: గుండారం జెడ్‌పిహెచ్ఎస్ పాఠశాల ఉపాధ్యాయులు నరేష్‌కు రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ బహుమతి, రాజుకి జిల్లా అవార్డు వచ్చిన శుభ సందర్భాంగా గుండారం గ్రామ పంచాయతీలో సన్మానం చేశారు. కార్యక్రమంలో జడ్పిటిసి సుమలత గోపాల్ రెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ శ్రీధర్, సర్పంచ్ లక్ష్మణరావు, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు మీసాల మధుకర్ రావు, ఎంపీటీసీ అంకం గంగాధర్, తదితరులు పాల్గొన్నారు

ఆర్మూర్: లయన్స్ క్లబ్ ఆఫ్ గ్రీన్ వారి ఆధ్వర్యంలో ఉపాధ్యా య దినోత్సవాన్ని జెంటిల్ కిడ్స్ ప్లే స్కూల్ యోగేశ్వర కాలనీ యందు బుధవారం ఘనంగా నిర్వహించడం జరిగింది. ఇట్టి కార్యక్రమంలో క్లబ్ అధ్యక్షులు లయన్ జెంటిల్ కిడ్స్ ప్రకాష్ గుజరాతి మాట్లాడుతూ సమాజంలో గురువుకి ఉన్నటువంటి ఉన్నతమైన స్థానం గురించి వివరించారు అలాగే గురు-శిష్యుల మధ్య పరస్పర సంబంధాన్ని గురించి వివరించారు అలాగే సమాజానికి గురు యొక్క ప్రాముఖ్యతను గురించి చాలా చక్కగా వివరించారు అలాగే క్లబ్ సెక్రటరీ అల్జాపూర్ రాజేష్ గారు మాట్లాడుతూ గురువు దేవునితో సమానం అని కొనియాడారు. కోశాధికారి కుంటాల నరేందర్ మాట్లాడుతూ గురువు లేనిదే సమాజం లేదు అని గురువు యొక్క విశిష్టతను తెలిపారు. ఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్ సభ్యులు చేపూర్ గణేష్, లీడర్ శ్రీనివాస్, దాచేపల్లి సంతోష్, దొండి సాయి కృష్ణ, రామకృష్ణ, బారాడ్ బాలాజీ రావు, శ్రీనివాస్ పాల్గొన్నారు.


కమ్మర్‌పల్లి: ఉత్తమ ఉపాధ్యాయురాలిని సన్మానిస్తున్న మంత్రి





నిజామాబాద్ రూరల్ : సన్మానిస్తున్న ప్రజాప్రతినిధులు ఆర్మూర్‌లో..

స్కూలు బస్సు ప్రమాదంలో చిన్నారి దుర్మరణం

నవతెలంగాణ-కంఠేశ్వర్

జిల్లా కేంద్రంలోని నాగారం 50 క్వార్టర్స్ ఆర్‌జీకే అపార్ట్‌మెంట్‌కు చెందిన చిన్నారి హయాతి (6) గాయత్రినగర్‌లోని చైతన్య స్కూల్‌లో యూకేజీ చదువుతోంది. అయితే బుధవారం చిన్నారి స్కూల్‌కి వెళ్లింది. తిరిగి అదే స్కూల్ బస్సులో ఇంటికి వచ్చింది. తన ఇంటి సమీపంలో బస్సు ఆగి పాపను దింపింది. అదే సమయంలో వెనకాలే విశ్వశాంతికి చెందిన స్కూలు బస్సు వేగంగా వచ్చింది. మరో వైపు జోరుగా వాన కురవడంతో ఈ క్రమంలో పాప బస్సు ప్రమాదంలో మరణించింది. కానీ వర్షం కారణంగా ఏ బస్సు ప్రమాదంలో మరణించిందో తెలియరాలేదు. సీసీ ఫుటేజ్ ఆధారంగా పరిశీలిస్తామని పోలీసులు తెలిపారు. ఏదిఏమైనా స్కూల్ బస్సుల కారణంగా చిన్నారి పాప దుర్మరణ పాలైంది. తల్లిదండ్రులు కన్నీరు మున్నీరవుతున్నారు. ఇదిలా ఉండగా.. చిన్నారి మృతదేహాన్ని పోలీసులు పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించేం దుకు ప్రయత్నిస్తుండగా.. స్థానికులు అడ్డుకొని వాగ్వాదానికి దిగారు. చైతన్య స్కూల్ బస్సు డ్రైవర్‌ను స్థానికులు చితకబాదారు. పోలీసులే న్యాయం చేయాలని ఇలా నిర్లక్ష్యపు డ్రైవింగ్‌ను నియంత్రించాలని పలువురు కోరుతున్నారు. చిన్నారి మృతిపట్ల సమగ్ర విచారణ జరపాలని స్థానిక ప్రజలు కోరుతున్నారు.


హయతి(ఫైల్)


ఆందోళన చేస్తున్న స్థానికులు

ప్రతి ఒక్కరూ సేవా కార్యక్రమాల్లో పాలుపంచుకోవాలి

- నిజామాబాద్ మున్సిపల్ కమిషనర్

నవతెలంగాణ-కంఠేశ్వర్

సమాజంలో తమ వంతు బాధ్యతగా ప్రతి ఒక్కరు సేవా కార్యక్రమాల్లో పాలుపంచుకోవాలని నిజామాబాద్ మున్సిపల్ కమిషనర్ మంద మకరంద్ అన్నారు.. కేవలం ప్రభుత్వ పాలన యంత్రాంగం బాధ్యతనే కాకుండా తోటి వారిగా తమ బాధ్యతగా సేవా కార్యక్రమాలు చేయాలని పిలుపునిచ్చారు.. నిజామాబాద్ జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి ప్రాంగణంలో నిజామాబాద్ మున్సిపల్ శాఖ పరిధిలో నిరాశ్రయుల కోసం ఏర్పాటు చేసిన పట్టణ నిరాశ్రయుల భవనం స్నేహ సొసైటీ ఆధ్వర్యంలో నిర్వహించబడుతుంది. పట్టణ నిరాశ్రయుల భవనంలో వాసవి క్లబ్ సీనియర్ సిటిజన్స్ నిజామాబాద్ మండల వాసవి క్లబ్ వనిత ఇందుర్ సంయుక్తంగా నిరాశ్రయులకు వర్షాకాలం, రానున్న చలికాలాన్ని దష్టిలో ఉంచుకుని దుప్పట్ల పంపిణీ కార్యక్రమం చేపట్టారు.. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా నిజామాబాద్ మున్సిపల్ కమిషనర్ మంద మకరంద్, హాజరయ్యారు.. నిరాశ్రయుల కోసం దుప్పట్ల పంపిణీ కార్యక్రమం తమ చేతుల మీదుగా చేయించడం సంతోషకరం అన్నారు. స్నేహ సొసైటీ నిర్వహిస్తున్న వివిధ ప్రాజెక్టుల గురించి స్నేహ సొసైటీ కార్యదర్శి సిద్దయ్య పలు విషయాలను మున్సిపల్ కమిషనర్ దష్టికి తీసుకువచ్చారు.

నిజామాబాద్ ప్రభుత్వ జనరల్ ఆస్పత్రి సూపరిడెంట్ డాక్టర్ ప్రతిమరాజ్ మాట్లాడుతూ నిజామాబాద్ ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిలో కార్పొరేట్ వైద్యానికి దీటుగా మెరుగైన వైద్య సేవలు అందించడం జరుగుతుందని, నగర ప్రజలు ప్రభుత్వ వైద్య సేవలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో స్థానిక కార్పొరేటర్ కల్పన, మల్లేష్ గుప్తా, డీఎంసీ శోభారాణి, కమ్యూనిటీ ఆర్గనైజర్ లావణ్య, స్నేహ సొసైటీ వైస్ ప్రిన్సిపాల్ రాజేశ్వరి, ఎన్ విమల తదితరులు పాల్గొన్నారు.


దుప్పట్లు పంచుతున్న కమిషనర్ మంద మకరంద్

కళాశాల విద్యార్థులకు ఆరోగ్య శిబిరం


విద్యార్థులకు ఆరోగ్య పరీక్షలు చేస్తున్న వైద్యులు

నవతెలంగాణ-బాల్కొండ

బాల్కొండ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో బుధవారం ఆర్‌బిఎస్‌కే హెల్త్ డిపార్ట్మెంట్ వారి ఆధ్వర్యంలో ఉచిత ఆరోగ్య శిబిరం నిర్వహించారు. వైద్యులు విద్యార్థిని విద్యార్థులకు రక్తహీనత ఇతర సమస్యలపై హెల్త్ చెకప్ చేశారు. ఈ సందర్భంగా డాక్టర్ సూర్యనారాయణ రావు మాట్లాడుతూ.. తెలంగాణ ప్రభుత్వం అందరికీ ఉచితంగా వైద్యాన్ని అందిస్తుందని, అందరు వినియోగించుకోవాలని కోరారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది స్రవంతి,ఫార్మసిస్ట్ స్వరూప, రాణి ఏఎన్ఎం , కళాశాల ప్రిన్సిపల్ చిన్నయ్య ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ గంగారం, కళాశాల అధ్యాపక బృందం, విద్యార్థులు పాల్గొన్నారు.

నేడు యాదవ సంఘం ఆధ్వర్యంలో 'శ్రీ కృష్ణ జన్మాష్టమి' వేడుకలు

నవతెలంగాణ-ముప్కాల్

శ్రీ కృష్ణ జన్మాష్టమి వేడుకలు నేడు నిర్వహిస్తున్నట్టు ముప్కాల్ 'శ్రీ కృష్ణ యాదవ పెద్ద సంఘం' అధ్యక్షులు కట్ట గోపి, సెక్రటరీ ట్రాక్టర్ శ్రీకాంత్ తెలిపారు. గురువారం అన్నదానం చేపట్టి మధ్యాహ్నం సమయంలో శ్రీవారి పల్లకి ఊరేగింపు ఉంటుందని పేర్కొన్నారు. అనంతరం సాయంత్రం 5 గంటల సమయంలో మార్కెట్ యార్డ్ స్థలంలో ఉట్టి కొట్టే కార్యక్రమం నిర్వహిస్తామని తెలిపారు. అధిక సంఖ్యలో యువకులు పాల్గొని కార్యక్రమం విజయవంతం చేయాలని సంఘ సభ్యులు కోరారు. మండలంలోని వేంపల్లి, వెంచిర్యాల గ్రామాల్లో సైతం శ్రీ కృష్ణ జన్మాష్టమి వేడుకలు నిర్వహిస్తున్నట్లు సంఘం పెద్దలు తెలిపారు.

గ్రామస్తుల పూజలు



నవతెలంగాణ-భిక్కనూర్

మండలంలోని జంగంపల్లి గ్రామంలో గత మూడు రోజుల నుండి కురుస్తున్న వర్షాలకు గ్రామంలో గల పెద్ద చెరువు అలుగు పారుతున్న సందర్భంగా గ్రామస్తులు గంగమ్మ తల్లికి పూజలు నిర్వహించారు. వరుసగా మూడవసారి చెరువు నిండిన సందర్భంగా గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ నర్సింలు యాదవ్, ఉప సర్పంచ్ భాస్కర్, ఎంపీటీసీ యశోద, బీఆర్ఎస్ పార్టీ మండల ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్, డిసిసిబి డైరెక్టర్, సొసైటీ చైర్మన్ సిద్ధరాములు, గ్రామపెద్దలు, తదితరులు పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై అవగాహన


అవగాహన కల్పిస్తున్న పోలీసులు

నవతెలంగాణ-బాల్కొండ

నిజామాబాద్ జిల్లా పోలీస్ కమిషనర్ ఆదేశాల మేరకు పోలీసు శాఖ ఆధ్వర్యంలో ప్రతి నెల మొదటి బుధవారం నిర్వహించే సైబర్ జాగురత దివస్ కార్యక్రమం సందర్భంగా బాల్కొండ మండల కేంద్రంలోని మహాత్మా జ్యోతి బాపూలే బీసీ బాలికల రెసిడెన్షియల్ పాఠశాలలో కమ్యూనిటీ పోలీసింగ్ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా విద్యార్థులకు డయల్ 100 ప్రాధాన్యత, సైబర్ నేరాలు, ఓటిపి, సైబర్ క్రైమ్‌ల గురించి విద్యార్థులకు అవగాహన కలిగించారు. కార్యక్రమంలో బాల్కొండ ఏఎస్సై శంకర్, పోలీస్ కానిస్టేబుల్ నరేష్, సతీష్, రోహిణి,పాఠశాల ప్రిన్సిపాల్ జ్యోతి, హాలిని, ప్రియా, పాఠశాల విద్యార్థులు పాల్గొన్నారు.